



కురుగుంటలో మాట్లాడుతున్న పరిటాల సునీత

నిధుల కొరతే కారణం : పరిటాల సునీత

అనంతపురం రూరల్: నిధుల కొరత కారణంగానే పింఛన్లను పంపిణీ చేయడం లేదని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. ఎన్నికల కమిషన్, తెలుగుదేశం పార్టీ కారణంగా జాప్యం జరగడం లేదని స్పష్టం చేశారు. ప్రతి నెలా అవ్వాతాతలకు అందాల్సిన పింఛన్ సొమ్మును కాంట్రాక్టర్లకు దోచిపెట్టిన ఘనుడు సీఎం జగన్ అని మండిపడ్డారు. సచివాలయ సిబ్బంది ద్వారా యుద్ధప్రాతిపదికన ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 3 నుంచి పింఛన్లను పంపిణీ చేస్తారని మార్చి 28న సాక్షి పత్రికలో సీఎం జగన్ ప్రభుత్వం చెప్పినట్లు వార్త వచ్చిందని అన్నారు. వాస్తవాన్ని కప్పిపెట్టి, ఎన్నికల్లో లబ్ధికోసం దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

దుర్మార్గుడు జగన్ : కాలవ శ్రీనివాసులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం: పింఛన్ల పంపిణీని రాజకీయ ప్రయోజనం కోసం వాడుకుంటున్న దుర్మార్గుడు సీఎం జగన్ అని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు విమర్శించారు. బ్యాంకుల బంద్ అని తెలిసి ముందస్తు ఏర్పాట్లు ఎందుకు చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ ఖజానాలో రూ.1900 కోట్లు పింఛన్లకు సంబంధించిన డబ్బు ఉందా అని నిలదీశారు. డబ్బు లేకుండా ఎలా పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. 3వ తేదీన పంపిణీ చేయాలని ప్రభుత్వం ఎప్పుడో నిర్ణయం తీసుకుందని అన్నారు. ఎన్నికల కమిషన్.. వలంటీర్లను బాధ్యతల నుంచి తప్పించింది కాబట్టి ఇవ్వలేకపోతున్నామని సాకులు చెబుతోందని విమర్శించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, పింఛన్లను పంపిణీ చేసే సామర్థ్యం సచివాలయ సిబ్బందికి ఉందని అన్నారు. వైసీపీ నాయకుల అసమర్థతను కప్పి పుచ్చుకోవడానికి టీడీపీ మీద నెపం వేస్తున్నారన్నారు. పింఛన్ల విషయంలో రాజకీయం తగదన్నారు. వైసీపీ కుట్రలకు సహకరిస్తున్న సీఎస్ జవహర్ రెడ్డిని ఆ హోదా నుంచి తప్పించాలని ఎన్నికల కమిషన్‌కు ఆయన విన్నవించారు.

కావాలనే జాప్యం : కేశవ్

ఉరవకొండ: పింఛన్ల పంపిణీని ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తోందని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆరోపించారు. వైసీపీ అసత్య ప్రచారాలను నమ్మొద్దని ప్రజలను కోరారు. ఒకటో తేదీన ఇవ్వాల్సిన పింఛన్‌ను మూడో తేదీ నుంచి ఇస్తామని చెప్పడం ప్రభుత్వ కుట్రపూరిత ఆలోచన అని విమర్శించారు. ఎన్నికల సంఘాన్ని, ప్రతిపక్షాలను బూచిగా చూపిస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని అన్నారు. సచివాలయాల్లో రాష్ట్రవ్యాప్తంగా 1,35,000 మంది సిబ్బంది ఉన్నారని, వీరందరూ ఇంటింటికీ వెళ్లి పింఛన్ ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. పింఛన్లను పంపిణీ చేయొద్దని టీడీపీ ఎవరినీ కోరలేదని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేశవ్

ఇదేం తీరు..!



వైసీపీ కోసం వలంటీర్ల రాజీనామా

- ఇన్నాళ్లూ ప్రజల సొమ్ముతో పారితోషికం
- ప్రభుత్వ వ్యవస్థలతో కలిసి సేవలు..
- ఎన్నికల సమయంలో అధికార పార్టీకి సేవ
- వైసీపీ అభ్యర్థుల మాయలో పడుతున్న వైనం
- పింఛన్ల పంపిణీలో జాప్యం.. వైసీపీ కుట్ర
- మండిపడుతున్న టీడీపీ నాయకులు

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

వలంటీర్ వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చింది. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు ఈ వ్యవస్థ ఏర్పడింది. ఇందుకుగానూ ప్రభుత్వం నుంచి వారికి నెల నెలా పారితోషికం అందుతోంది. అంటే.. వారు ప్రభుత్వ పరిధిలోనే ఉన్నట్లు లెక్క..! కానీ ఈ విషయాన్ని మరిచి కొందరు పార్టీ పరిధిలోకి వెళ్లిపోయారు. వైసీపీ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించిన పలువురిని అధికారులు విధుల నుంచి తొలగించారు. అయినా పెద్దగా మార్పు కనిపించలేదు. ఈ నేపథ్యంలో పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దీన్ని ఆసరగా చేసుకుని, టీడీపీ కూటమిని ఇరకాటంలో పెట్టేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఉద్దేశపూర్వకంగా పింఛన్ల పంపిణీలో జాప్యం జరిగేలా కుట్రలు చేస్తున్నారని టీడీపీ నాయకులు మండిపడుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలలో వెంటనే పింఛన్‌లను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు వైసీపీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేసేందుకు వందలాది మంది వలంటీర్లు రాజీనామాలు చేయడం ప్రారంభించారు. ఇన్నాళ్లూ ప్రభుత్వం తరఫున ప్రజా ధనాన్ని పారితోషికంగా తీసుకుని.. ఇప్పుడు ఒక పార్టీకోసం పనిచేయడం ఏమిటని ప్రజలు విమర్శిస్తున్నారు.



యాడికి: పంచాయతీ కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

టీడీపీపై నెపం...

రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి పంచాయతీ పరిధిలో 20 మంది వలంటీర్లు సోమవారం రాజీనామ చేశారు. రాజీనామ పత్రాలను ఎంపీడీఓ గీతావాణికి అందజేశారు. ప్రసన్నాయపల్లి రెండో గ్రామ సచివాలయంలో మొత్తం 24 మంది వలంటీర్లు ఉన్నారు. ఎన్నికల కోడ్ ప్రకటించిన రోజు నలుగురు రాజీనామ చేశారు. మిగిలిన 20 మంది సోమవారం రాజీనామా చేశారు. ఎన్నికల కమిషన్‌కు టీడీపీ ఫిర్యాదు చేసిందని, అందుకు నిరసనగా రాజీనామా చేస్తున్నామని సాకు చూపించారు. రాజీనామ లేఖలో రాప్తాడు ఎంపీడీఓకు అని రాయకుండా, అనంతపురం రూరల్ మండలం అని రాశారు. దీంతో రాప్తాడు మండలం అని రాసి ఇవ్వాలని ఎంపీడీఓ వారికి సూచించారు.

వ్యక్తిగత కారణాలట..

యాడికి మండలంలో సోమవారం 66 మంది వలంటీర్లు రాజీనామా చేశారని ఎంపీడీఓ సావిత్రి తెలిపారు. చందన పంచాయతీలో 15, నగరూరు-14, పుప్పాల-2, రాయలచెరువు-1వ సచివాలయ పరిధిలో 19 మంది, రెండో సచివాలయ పరిధిలో 16 మంది రాజీనామా చేశారని ఆమె తెలిపారు. వీరందరూ వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొనడం గమనార్హం. అయితే పక్కా ప్రణాళికతోనే వలంటీర్లు రాజీనామా చేశారని స్థానికంగా చర్చించుకుంటున్నారు. వైసీపీ అభ్యర్థి తరఫున ప్రచారం చేసేందుకే రాజీనామా చేశారని అంటున్నారు. వైసీపీ నాయకుల నుంచి ఆదేశాలు వచ్చాయని, వలంటీర్ల పరిధిలోని ఇళ్లకు వెళ్లి గట్టిగా ప్రచారం చేయాలని, అందుకు ప్రతిఫలంగా డబ్బు, కానుకలు ఇస్తామని ప్రలోభ పెట్టారని ప్రచారం జరుగుతోంది. అధికారం చేపట్టాక తిరిగి వలంటీర్లుగా అవకాశం కల్పిస్తామని భరోసా ఇస్తున్నారని సమాచారం.

నాలుగో సచివాలయం పరిధిలో 40 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను సచివాలయ కార్యదర్శి మహేశ్వర్‌రెడ్డికి అందజేశారు.

- రామగిరి మండల కేంద్రంలో ఆరుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. ఎంపీడీఓ ఫజల్‌బాషాకు రాజీనామ పత్రాలను అందజేశారు. రాజీనామాలను ఆమోదించామని ఎంపీడీఓ తెలిపారు.

నలుగురు రాజీనామా..

రాయదుర్గం మండలం బీఎన్‌హళ్లి పంచాయతీలో నలుగురు వలంటీర్లు రాజీనామా చేశారని పంచాయతీ కార్యదర్శి శోభ తెలిపారు. వలంటీర్లు మారెన్న, లేపాక్షి, అశోక్, మారుతి రాజీనామా చేయడంతో ఎంపీడీఓ అల్లాబకాష్ ఆమోదించారని ఆమె తెలిపారు.

మూకుమ్మడిగా...

తాడిపత్రి మండలంలో పనిచేస్తున్న 245 మంది గ్రామ వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారని ఎంపీడీఓ నరసింహారావు తెలిపారు. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారని ఆయన అన్నారు. వైసీపీ నాయకులే వారిచేత రాజీనామా చేయించారని ప్రచారం జరుగుతోంది. ఎన్నికల ప్రచారంలో వలంటీర్లను ఉపయోగించుకునేందుకు వీలుగా ఈ ఎత్తుగడ వేశారని స్థానికులు అంటున్నారు. ఇక్కడ కూడా డబ్బు, కానుకలను ఇస్తామని ప్రలోభపెట్టినట్లు తెలిసింది.

- అనంతపురం రూరల్ మండలంలోని పాపంపేట పంచాయతీ

మూడు నెలలు దూరం

అనంతపురం క్లాక్‌టవర్: ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున మూడు నెలల పాటు వలంటీర్లను పింఛన్‌ల పంపిణీకి దూరం పెడుతూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమి సూచనల మేరకు డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ నరసింహారెడ్డి ఈ మేరకు సోమవారం సర్క్యులర్ జారీ చేశారు. ఏప్రిల్, మే, జూన్ నెలల పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరంగా పెట్టాలని నిర్ణయించారు. ఈ నెల పింఛన్‌లను గ్రామ, వార్డు సచివాలయాల వద్ద బుధవారం నుంచి 8వ తేదీ వరకు పంపిణీ చేస్తామని పీడీ పేర్కొన్నారు.

రాజకీయం తగదు: రాంభూపాల్



అనంతపురం కల్చరల్: ఎన్నికల కోడ్ కారణంగా వలంటీర్ల ద్వారా పింఛన్, రేషన్ పంపిణీలో వలంటీర్లు పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశించిందని, కాబట్టి ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ కోరారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్లవద్దనే పింఛన్లు ఇవ్వాలని కోరారు. ఎండలు తీవ్రంగా ఉన్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం, ఇతర సరుకుల పంపిణీని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ నెలలో ఉగాది, రంజాన్, శ్రీరామనవమి వంటి పెద్ద పండుగలు ఉన్నాయని, అధికార, ప్రతిపక్షాలు రాజకీయ ప్రయోజనాలకోసం పేదల పథకాలను ఉపయోగించుకోవాలని చూడడం సరికాదని అన్నారు. వెంటనే పింఛన్, రేషన్ పంపిణీ చేపట్టకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

మీరు ప్రచారం చేశారు : ఎంపీడీఓ

ఉరవకొండ మండల పరిధిలోని వెలిగొండ గ్రామానికి చెందిన పలువురు వలంటీర్లు రాజీనామా చేసేందుకు ప్రయత్నించారు. మొత్తం తొమ్మిది మంది ఎంపీడీవో అమృత్‌రాజ్‌ను సోమవారం కలిసి, రాజీనామా పత్రాలను అందించేందుకు ప్రయత్నించారు. దీంతో వారిపై ఎంపీడీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి తనయుడు ప్రణయ్‌రెడ్డితో కలిసి ఆదివారం సాయంత్రం కొందరు వలంటీర్లు ప్రచారంలో పాల్గొన్నారు. వీరిపై అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో రాజీనామా ఎత్తుగడ వేశారు. 'మీరు ప్రచారంలో పాల్గొన్నట్లు ఆధారాలు ఉన్నాయి. విచారణ తరువాత రాజీనామాలపై నిర్ణయం తీసుకుంటాం' అని ఎంపీడీఓ వారికి చెప్పి పంపించారు. ఫోన్‌లు, డివైజ్‌లు కార్యదర్శికి అప్పగించాలని సూచించారు.



రాజీనామా చేసేందుకు వచ్చిన ఉరవకొండ వలంటీర్లు

దర్జాగా ప్రచారం



వైసీపీ నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్న యానిమేటర్ రామకృష్ణ

శింగనమల/అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 1: వైసీపీ అభ్యర్థుల కోసం ఉపాధి సిబ్బంది ప్రచారం కొనసాగుతోంది. శింగనమల మండలం నాగులగుడ్డం తండా, నాగులగుడ్డం, గురుగుంట్ల, వెస్టునరసాపురం, చిన్నజలాలపురం గ్రామాల్లో వైసీపీ అభ్యర్థి వీరాంజినేయులుతో కలిసి ఆకులేడు ఫీల్డ్ అసిస్టెంట్ గాంగధర్‌రెడ్డి ప్రచారం చేశాడు. విడపనకల్లు మండలంలోని కామధేను గ్రామైక్య సంఘం యానిమేటర్ రామకృష్ణ వైసీపీ నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్నట్లు అధికారులు నిర్ధారించారు. అతన్ని విధుల నుంచి తొలగించారు.



గురుగుంట్లలో వైసీపీ ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్ గంగాధర్‌రెడ్డి

ఖాతాలపై నిఘా పెట్టండి

నోడల్ అధికారులకు కలెక్టరు ఆదేశం

అనంతపురం టౌన్, ఏప్రిల్ 1: రాజకీయ పార్టీలు, అభ్యర్థుల బ్యాంకు ఖాతాలపై నిఘా పెట్టాలని నోడల్ అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు గౌతమి ఆదేశించారు. ఎన్నికల ఖర్చుల వ్యవహారాలపై తీసుకోవాల్సిన చర్యలు గురించి నోడల్ అధికారులతో సోమవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. పార్టీలు, అభ్యర్థుల బ్యాంకు ఖాతాల వివరాలను ఇవ్వాలని 33 బ్యాంకులను కోరామని, ఇప్పటివరకు కేవలం నాలుగు బ్యాంకుల నుంచి మాత్రమే వివరాలు అందాయని తెలిపారు. మిగిలిన బ్యాంకులు కూడా వెంటనే డేటాను సమర్పించాలని సూచించారు. ప్రతి రోజు రూ.10 లక్షలు, అంతకన్నా ఎక్కువ లావాదేవీలు జరిగిన వారి సమాచారం ఇవ్వాలని సూచించారు. నగదు లావాదేవీలు నెలకు రూ.50 లక్షలు, అంతకన్నా ఎక్కువగా జరిగితే.. వారి వివరాలు అందజేయాలని అన్నారు. యూపీఐల నుంచి రూ.2 వేలు, అంతకంటే ఎక్కువగా ఒకే ఖాతా నుంచి చాలా మంది ఖాతాలకు డబ్బు పంపితే.. ఆ వివరాలను కూడా తెలపాలని అన్నారు. ప్రతి రోజు బ్యాంకు ఖాతాలను పరిశీలించాలని, అభ్యంతరకర లావాదేవీలు ఉంటే.. ఆ వివరాలు పంపించాలని సూచించారు. ఈ నివేదికలను ప్రతిరోజూ ఖర్చుల అంచనా కమిటీకి అందజేయాలని బ్యాంకర్లకు సూచించారు. నామినేషన్ వేసే ముందు అభ్యర్థుల చేత బ్యాంకు ఖాతాలు తెరపించాలని, అప్పటి నుంచి ఖర్చుల వ్యవహారాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని నోడల్ అధికారులకు సూచించారు. సమావేశంలో జేసీ కేతన్‌గార్గ్, జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, ఎల్‌డీఎం సత్యరాజ్ పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు గౌతమి

మా డబ్బులు మాకివ్వండి..!

'జగనన్న ఇళ్లను కట్టించి ఇస్తామంటే ఒక్కొక్కరం రూ.35 వేలు కాంట్రాక్టరుకు ఇచ్చాం. ఇప్పటి వరకూ ఇళ్లను కట్టింది లేదు. మా డబ్బులను మాకు ఇప్పించండి..' అని యాడికి పట్టణానికి చెందిన లబ్ధిదారులు ఎంపీడీఓ సావిత్రిని కోరారు. 2023 డిసెంబరు 30 నాటికి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ చెప్పారని, అందుకోసం అధికారులు తమ నుంచి రూ.35 వేలు అదనంగా కట్టించుకున్నారని అన్నారు. ఏప్రిల్ నెల వచ్చినా కాంట్రాక్టర్ ఇంతవరకు ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రశ్నిస్తే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని అన్నారు. ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయలేనప్పుడు అదనపు డబ్బులు ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. అదనపు డబ్బులను తమకు తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు. అక్కడే ఉన్న హౌసింగ్ ఏఈ ప్రశాంత్‌కుమార్‌తో వారు వాగ్వాదానికి దిగారు. లబ్ధిదారులు వినతిపత్రం ఇస్తే సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీఓ తెలిపారు. దీంతో వారు ఆమెకు వినతిపత్రం రాసిచ్చారు.

- యాడికి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

మార్చేదే లే..!

- నాకోసం పనిచెయ్యండి.. పోండి..
- ఏమైనా ఉంటే పెద్దిరెడ్డికి, అనంతకు చెప్పండి
- శింగనమల అభ్యర్థిత్వంపై తేల్చి చెప్పిన సీఎం జగన్
- వైసీపీ అసమ్మతి నాయకులకు చేదు అనుభవం


బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 1: వైసీపీ శింగనమల నియోజకవర్గ అసమ్మతి నాయకులకు సీఎం జగన్ వద్ద చేదు అనుభవం ఎదురైంది. బత్తలపల్లి మండలం సంజీపురం వద్ద సీఎం జగన్‌ను మాజీ మార్కెట్ యార్డు చైర్మన్లు సత్యనారాయణరెడ్డి, నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి, పార్టీ నాయకులు సాకే రామక్రిష్ణ, గోకుల్ రెడ్డి సోమవారం కలిశారు. వీరాంజినేయులు అభ్యర్థిత్వాన్ని, ఆలూరు సాంబశివారెడ్డి నాయకత్వాన్ని మార్చాలని సీఎం జగన్‌ను వారు కోరినట్లు తెలిసింది. అయితే, వారిని మార్చే ప్రసక్తే లేదని సీఎం జగన్ నవ్వుతూనే.. సూటిగా చెప్పినట్లు సమాచారం. 'నేను సీఎం కావాలా? వద్దా? నా కోసం మీరంతా పనిచేయాలి. వాళ్లతో పనిలేదు. నన్ను చూడండి' అని అసమ్మతి నాయకులకు జగన్ సూచించినట్లు తెలిసింది. 'ఆలూరు సాంబశివారెడ్డితో మీకు పని లేదు. ఏదైనా పని ఉంటే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి చేసిపెడతారు' అని చెప్పినట్లు సమాచారం.

ఆలూరు సాంబశివారెడ్డి నాయకత్వంలో శింగనమల నియోజకవర్గంలో క్యాడెర్ చాలా దెబ్బతిందని, తిరిగి అదే జరుగుతుందన్న భావనతో నిరుత్సాహంగా ఉన్నారని వారు సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఇకపై అలాంటివి ఏమీ ఉండవని, అంతా కలిసి పని చేసి వైసీపీ అభ్యర్థిని గెలిపించాలని సీఎం జగన్ అసమ్మతినేతలకు సూచించినట్లు సమాచారం. 'త్వరలోనే ఆలూరు సాంబశివారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజినేయులు, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, నియోజకవర్గ పరిశీలకులు రమేష్‌రెడ్డి వచ్చి మీతో మాట్లాడుతారు' అని జగన్ చెప్పారని ఆ పార్టీవర్గాలు తెలిపాయి. అసమ్మతి నాయకులు చెప్పిన అంశాలను సీఎం జగన్ ఏ మాత్రం పరిగణలోకి తీసుకోకపోవడంతో వారు నిరుత్సాహంతో వెనుదిరుగి వచ్చినట్లు తెలిసింది. అసమ్మతి నేతలలో కొందరు ఈ ఎన్నికలలో తటస్థంగా ఉండేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

అసమ్మతిలో అసమ్మతి

సీఎం జగన్‌ను కలిసే అంశంలో అసమ్మతి నేతలలో మరో అసమ్మతి తెరపైకి వచ్చింది. సీఎం జగన్‌ను కలిసేందుకు ఒకరు మినహా.. నలుగురు రెడ్డి సామాజికవర్గం నాయకులకే అవకాశం ఇచ్చారు. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల నేతలు అసంతృప్తికి గురైనట్లు సమాచారం. 'కనీసం జగన్‌ను కలిసి మా ఆవేదన, సమస్యలు చెప్పుకుందామని అనుకున్నాం. దానికి కూడా అవకాశం ఇవ్వకుంటే ఎలా?' అని వారు ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించిన వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు మిద్దె కుళ్లాయప్ప, చామలూరు రాజగోపాల్‌కు సీఎం జగన్‌ను కలిసే అవకాశం ఇవ్వలేదు. దీంతో వారు తీవ్ర నిరాశ చెందారు. 'ఇన్ని సంవత్సరాలు పార్టీ కోసం పనిచేస్తే రెండు నిమిషాలు మాట్లాడే తీరిక లేకపోతే ఎలా?' అని జగన్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బీసీ సామాజికవర్గానికి చెందిన బుక్కరాయసముద్రం ఎంపీపీ సునీత, శింగనమల మాజీ కన్వీనర్ పట్నం నాగేష్ తదితరులకు తగిన గౌరవం ఇవ్వలేదని ఆ వర్గంవారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ బీసీ నాయకులను కలుపుకుని వీరాంజినేయులకు వ్యతిరేకంగా పనిచేస్తామని హెచ్చరించినట్లు తెలిసింది.

రూ.1.31 కోట్లు సీజ్



పట్టుబడ్డ నగదు

తాడిపత్రి టౌన్, ఏప్రిల్ 1: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1,31,35,750 నగదును సీజ్ చేశామని సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, తాడిపత్రి డీఎస్పీ గంగయ్య సోమవారం తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. పట్టణంలోని మెయిన్‌బజారుకు చెందిన ఖాజీమస్తాన్ వలి, ఖాజీ నసీమున్నీసా, చిన్నకోట్ల రషీదా ఒకే కుటుంబానికి చెందినవారని, వీరు ఇతర రాష్ట్రాల్లో బంగారు కొనుగోలు చేసి తాడిపత్రిలో అధిక ధరలను విక్రయిస్తుంటారని తెలిపారు. వీరు ముగ్గురు నగదును తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. నగదును సీజ్ చేసి ఐటీ విభాగానికి అప్పగించామని తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	మంగళవారం సాయంత్రం 06:33
సెహరీ	బుధవారం ఉదయం 04:58

ఉష్ణోగ్రతలు (సోమ)



గరిష్ఠం : 41.0
కనిష్ఠం : 25.0

టీడీపీలో చేరుతాం

వైసీపీ శింగనమల అసమ్మతి నాయకులు టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాములూరి రాజగోపాల్ ఇంట్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గం నాయకులు సోమవారం సమావేశమయ్యారు. పలువురు కార్యకర్తలు, నాయకులు సైతం పాల్గొన్నారు. వైసీపీ అభ్యర్థి వీరాంజినేయులు, ఆలూరు సాంబశివారెడ్డి నేతృత్వంలో పనిచేయడం తమకు ఇష్టం లేదని తెల్చిచెప్పారు. 'సీఎం జగన్ న్యాయం చేస్తారని ఆశ ఉండేది. సోమవారం అదికూడా తేలిపోయింది. కొంతమందినే సీఎం కలిశారు. అందుకే మాకు వైసీపీలో కొనసాగడం ఇష్టం లేదు..' అని పలువురు స్పష్టం చేసినట్లు తెలిసింది. అసమ్మతి వర్గీయులు గురువారం సమావేశమై, టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారని తెలిసింది. వారితోపాటు బుక్కరాయసముద్రం ఎంపీపీ దాసరి సునీత, నార్పల మండలంలోని పలువురు సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు కూడా టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.



సీఎం జగన్‌ను కలిసే అవకాశం దక్కకపోవడంతో చామలూరు రాజగోపాల్ ఇంట్లో సమావేశమైన అసమ్మతి నాయకులు

నిబంధనల మేరకు కమీషన్ వసూలు చేయాలి

● మార్కెట్ యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి



మాట్లాడుతున్న యార్డు కార్యదర్శి జయలక్ష్మి

అనంతపురంరూరల్, ఏప్రిల్ 1: టీసీ మార్కెట్‌లో నిబంధనల మేరకు రైతుల నుంచి కమీషన్ వసూలు చేయాలని అనంతపురం మార్కెట్ యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి సూచించారు. ఆ మేరకు సోమవారం యార్డులోని తన చాంబర్‌లో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. మార్కెట్‌లో రైతుల నుంచి 10 శాతం కమీషన్ వసూలు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. నిబంధనల ప్రకారం 4 శాతం మాత్రమే కమీషన్ వసూలు చేయాలన్నారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి నష్టం జరకుండా చూడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. దీనిపై పలువురు వ్యాపారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. చట్టప్రకారం కమీషన్ నాలుగుశాతం వసూలు చేస్తున్నామన్నారు. సూట్, గ్రేడింగ్ లేకుండానే కాయలు కొనుగోలు చేస్తున్నామన్నారు. ఎక్కడ ఈ విధంగా కొనుగోలు చేయడం లేదన్నారు. పులివెందుల మార్కెట్‌లో బాడుగలు, ఇతరాత్రవీ ఏవీ లేకుండానే ఎనిమిది శాతం కమీషన్ రూపంలో తీసుకొంటూ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని కార్యదర్శి దృష్టి వ్యాపారులు తెచ్చారు.

ఏపీపీఎస్సీ కుంభకోణంపై ఫిర్యాదు

● ప్రభుత్వ పెద్దలపై కేసు నమోదు చేయాలి
● టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత డిమాండ్



సీఐకి ఫిర్యాదు చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 1: ఏపీపీఎస్సీ కుంభకోణంపై ముఖ్యమంత్రి జగన్, ఏపీపీఎస్సీ ఛైర్మన్ గౌతమ్ సవాంగ్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై కేసు నమోదు చేయాలంటూ తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు జిల్లాకేంద్రంలోని అర్బన్ పోలీసు స్టేషన్‌లో సీఐ కొండారెడ్డికి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది నిరుద్యోగులు ఏళ్లుగా కష్టపడి చదువుతూ గ్రూప్1 పరీక్ష రాశారన్నారు. అనంతరం మూల్యాంకనంలో భారీగా అక్రమాలకు పాల్పడి అర్హులకు కాకుండా తమ అస్మదీయులకు ఉద్యోగాలు కట్టబెట్టిన ఏపీపీఎస్సీ ఛైర్మన్, ఏపీపీఎస్సీ సెక్రటరీ, ప్రభుత్వ సలహాదారుపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నేతలు అంబులెన్సు రమేష్, ఓబుళరెడ్డి, నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, వైవీ మురళీచౌదరి, బొల్లే సుధీర్, యనమల గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, గణేష్‌చౌదరి పాల్గొన్నారు.

బీఈడీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 1: ఎస్కేయూ బీఈడీ కళాశాలలో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్‌ల ప్రక్రియ చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ సదాశివరెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. బుధవారం నిర్వహించే ఈ ఇంటర్వ్యూలకు ఏపీ ఎడ్‌సెట్-2023లో అర్హత సాధించిన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. అడ్మిషన్ అయిన విద్యార్థులు అదే రోజు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

● జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 1: శ్రీసత్యసాయి జిల్లాలో మే 11న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. మే నెల రెండో శనివారం ఉదయం 10.30 గంటలకు అన్ని కోర్టులలో నిర్వహించే అదాలత్‌లో మోటారు వాహనాల ప్రమాదభరిత కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాలు, పారిశ్రామిక వివాదాలు తదితర కేసులు రాజీ చేస్తారన్నారు. సంబంధిత కక్షిదారులు అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఐటీఐ విద్యార్థులకు ఉద్యోగ మేళా

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 1: ఐటీఐ పూర్తిచేసిన నిరుద్యోగ యువతీ, యువకులకు అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామమూర్తి సోమవారం ప్రకటనలో తెలిపారు. టాప్‌లైన్ బిజినెస్ మేనేజ్‌మెంట్, హోండా లాజిస్టిక్స్ సంస్థల్లో పనిచేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐటీఐ నుంచి ఏదేని ట్రేడ్ పూర్తిచేసిన వారు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.12వేల నుంచి రూ.16వేల వరకు జీతం చెల్లిస్తారన్నారు. ఆసక్తిగలవారు 3వ తేదీన కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలకు వారి బయోడేటాతో హాజరుకావాలని కోరారు.

మార్కెట్ ఫీజు వసూళ్ల టార్గెట్ పూర్తి

అనంతపురంరూరల్, ఏప్రిల్ 1: జిల్లా మార్కెటింగ్ శాఖ లక్ష్యాన్ని పూర్తి చేసింది. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషన్ జిల్లా శాఖకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.10కోట్లకుపైగా లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈలక్ష్యాన్ని మార్చి ఆఖరికి పూర్తి చేసి లక్ష్యాన్ని అధిగమించింది. గత ఆర్థిక సంవత్సరం జిల్లా మార్కెటింగ్ శాఖ పరిధిలోని మార్కెట్ యార్డులకు రూ.10.81కోట్ల టార్గెట్ కేటాయించారు. ఇందులో గుత్తి, గుంతకల్లు మార్కెట్ యార్డులు మినహాయిస్తే అన్ని యార్డులు తమ లక్ష్యాన్ని చేరుకున్నాయి. అనంతపురం మార్కెట్ యార్డుకు రూ.4.10 కోట్లుకాగా..4.27 కోట్లు వసూలు చేసింది. గుత్తి మార్కెట్ యార్డు రూ.28లక్షలుకాగా..రూ.21.61 లక్షలు, గుంతకల్లు రూ.85 లక్షలు కాగా రూ.58.56 లక్షలు, కళ్యాణదుర్గం యార్డు రూ.52 లక్షలు కాగా రూ.61.01 లక్షలు, రాప్తాడు యార్డు రూ.50లక్షలు కాగా రూ.49.54లక్షలు, రాయదుర్గం రూ.1.20 కోట్లు కాగా రూ.1.32 కోట్లు, శింగనమల రూ.75 లక్షలుకాగా రూ.1.01 కోట్లు, తాడిపత్రి రూ.1.85 కోట్లు కాగా1.90 కోట్లు, ఉరవకొండ రూ.76 లక్షలు కాగా రూ.89.36లక్షల మార్కెట్ ఫీజు వసూలు చేశాయి. మొత్తంగా రూ.11.30కోట్లు వసూలు చేసి 104.62 శాతంతో రాష్ట్రంలో జిల్లా ఆరో స్థానంలో నిలిచింది. కార్యదర్శులు, ఉద్యోగులు, సిబ్బంది సమష్టి కృషితో లక్ష్యానికి చేరుకున్నట్లు ఏడీ సత్యనారాయణ చౌదరి తెలిపారు.

ఫర్టిలైజర్ దుకాణ యజమాని దారుణ హత్య

నార్పల, ఏప్రిల్ 1: మండల కేంద్రంలోని రేణుక ఫర్టిలైజర్ దుకాణ యజమాని వీరభద్ర(40) దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కడప జిల్లా పులివెందులకు చెందిన వీరభద్రకు 12 ఏళ్ల క్రితం నార్పల మండలంలోని గడ్డం నాగేపల్లికి చెందిన రేణుకతో వివాహమైంది. వీరభద్ర అప్పటి నుంచి నార్పలలోనే నివాసం ఉంటూ గడ్డంనాగేపల్లికి చెందిన సమీప బంధువుతో కలిసి ఎరువుల దుకాణం నిర్వహిస్తుండేవాడు. అంతకుముందు ఐదు సంవత్సరాలు వీరభద్ర వారి సమీప బంధువుతోనే ఎరువుల దుకాణం నిర్వహించాడు. వారివురి మధ్య ఆర్థిక సమస్యలు తలెత్తడంతో వేరువేరుగా దుకాణాలు నడుపుతున్నారు. వీరభద్ర సమీప బంధువుతో ఈ విషయంపై అప్పుడప్పుడు ఘర్షణలు పడుతుండేవారు. ఇదే క్రమంలో పక్కా ప్లాన్ ప్రకారం బంధువు మరొకరితో కలిసి వేటకొడవళ్లతో వీరభద్ర ఎరువుల దుకాణంలోకి చొరబడి, తలుపులు మూసేసి విచక్షణారహితంగా కొడవళ్లతో నరికారు. దీంతో వీరభద్ర అక్కడికక్కడే మృతిచెందాడు. నిందితులు అక్కడి నుంచి ద్విచక్రవాహనంపై పరారయ్యారు. వీరభద్రకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకటశివారెడ్డి పరిశీలించారు. భార్య రేణుక ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

అటవీశాఖకు అవినీతి మసి





● బొగ్గు బట్టీల నిర్వహణకు రూ.లక్షల్లో కప్పం..
● అనుమతి ఒకచోట.. నిర్వహణ మరోచోట..
● డీఎఫ్ఓ పేరుతో వసూళ్ల దందా..
● అక్రమాలపై విమర్శల వెల్లువ

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 1: జిల్లా అటవీశాఖకు అవినీతి 'మసి' అంటుకుంది. ముళ్లకంపల నుంచి తయారు చేసుకొనే బొగ్గు తయారు కావాలన్నా కిల్లీ కిల్లీకి కప్పం కట్టాల్సిందేనని కొందరు వాపోతున్నారు. ధర్మవరం డిప్యూటీ రేంజర్ అనంతపురం రేంజ్‌లో అనంతపురం సర్కిల్‌తో పాటు, ఆత్మకూరు సర్కిల్‌కు కూడా ఒకరే ఇన్‌చార్జి కావడంతో అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్న ప్రచారం సాగుతోంది. కప్పం కడితేనే అనుమతులు వస్తాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిజాయితీ గల డీఎఫ్ఓ పేరుతో సిబ్బంది వసూళ్లకు పాల్పడడం విడ్డూరం. కిల్లీల అనుమతికి కార్యాలయానికి రావాలంటేనే ఫ్యాక్టరీల నిర్వాహకులు భయపడుతున్నారన్న చర్చ జరుగుతోంది. అధికారులు మారిన ప్రతిసారి సిబ్బంది ఇలా అక్రమాల పర్వానికి దిగుతున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇప్పటికైనా డీఎఫ్ఓ స్పందించకపోతే సిబ్బంది ఆగడాలకు అడ్డులేకుండా పోతుందని పలువురు అంటున్నారు.



రాప్తాడు ప్రాంతంలో నిర్వహిస్తున్న బొగ్గుల బట్టీ



జిల్లా అటవీశాఖ కార్యాలయం

నిబంధనలకు నీళ్లు..

బొగ్గు బట్టీలకు సంబంధించి అనుమతి ఇవ్వాలంటే అటవీ ప్రాంతానికి 5 కిలోమీటర్ల లోపు అనుమతి ఇవ్వడానికి వీలు లేదు. ముడుపులు పుచ్చుకొని యథేచ్ఛగా సమీపంలోనే అనుమతులు ఇస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డివిజన్ పరిధిలో బొగ్గు బట్టీల్లో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతుంటే.. డీఎఫ్ఓ అడ్డుకోకపోవడం విమర్శలకు తావువిస్తోంది. ధర్మవరం, ధర్మపురి, దర్శినమల, రాప్తాడు, మర్తాడు, శింగనమల, పెద్ద పప్పూరు మండలం, పెద్ద ఎక్కులూరులోను, అదే విధంగా పెద్దవడుగూరు ప్రాంతాల్లో అనధికారికంగా పెద్ద ఎత్తున కిల్లీలు నిర్వహిస్తున్నా.. సిబ్బంది చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అమ్యామ్యాలిస్తేనే.. అనుమతులు..!

అనంతపురం రేంజర్‌లో డీఎఫ్ఓ బాధ్యతలు చేపట్టిన తరువాత పేరుకు మాత్రం ప్రభుత్వం నుంచి నిధులు లేవు. అయితే అక్రమ మార్గాల ద్వారా సిబ్బంది జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రేంజ్ పరిధిలో ఏవైనా నూతన నిర్మాణాలకు చెట్లు తొలగించాలంటే అనుమతి కోసం కార్యాలయం చుట్టూ తిరగాల్సిందే. దీంతో పాటు చేయి తడపాల్సిందే. అనుమతి లేకుండా తొలగిస్తే, దొరికిన తర్వాత సిబ్బంది చుక్కలు చూపిస్తారన్న విమర్శలు ఉన్నాయి.

ప్రతి పర్మిట్‌కు రూ.10వేలు..

బొగ్గుల బట్టీ అనుమతులు తీసుకున్నప్పటికీ, బొగ్గును తరలించడానికి అనుమతి తప్పనిసరి. ఒకసారి అనుమతి పొందితే 8 సార్లు బొగ్గు తరలించే అవకాశం ఉంది. ఇక్కడ తరలించిన ప్రతీసారి రూ.10 వేలు ఇవ్వాల్సిందేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల పేరుతో సిబ్బంది చేస్తున్న ఆగడాలకు అడ్డులేకుండా పోయిందని, ఇప్పటికైనా డీఎఫ్ఓ వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

రెన్యువల్‌కు ముడుపులు ఇవ్వాల్సిందే..

జిల్లాలో 60కి పైగా రంపపు కోత మిల్లులు ఉన్నాయి. వీటిలో ఎక్కువ శాతం అనంతపురం, గుత్తి రేంజ్‌లోనే ఉన్నాయి. మిల్లులకు అనుమతులున్నప్పటికీ, ఏటా రెన్యువల్ చేసుకోవాల్సిందే. రెన్యువల్ చేసుకోవడానికి ముడుపులు లేనిదే ఫైల్ కదలడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మొత్తానికి ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో అటవీశాఖలో అక్రమాలకు అడ్డూ అదుపులేకుండా పోయిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘాతో అవినీతిని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పోలింగ్ సిబ్బంది జాబితాకు కలెక్టరు ఆమోదం

● పీఓలు 2,552, ఏపీఓలు 2,715 మంది..
● 5, 7, 14 తేదీల్లో శిక్షణ

అనంతపురం టౌన్, ఏప్రిల్ 1: ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ సిబ్బంది ఎంపిక పక్రియ పూర్తయ్యింది. నెలరోజులుగా పోలింగ్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్ల ఎంపికకు జిల్లా యంత్రాంగం కుస్తీపడుతోంది. ఎట్టకేలకు పీఓలు, ఏపీఓల జాబితాను సిద్ధం చేశారు. ఎనిమిది నియోజకవర్గాలకు చెందిన జాబితాను మంగళవారం కలెక్టరు గౌతమి వద్దకు తీసికెళ్లగా ర్యాండమ్‌గా చెక్ చేసి పీఓ, ఏపీఓల జాబితాకు ఆమోదం తెలిపారు. జాబితా ప్రకారం పీఓలు 2,552 మంది ఉండగా అసిస్టెంట్ ఏపీఓలు 2,715 మంది ఉన్నారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు ఎంపికైన ప్రతి ఒక్కరికి నియామక ఉత్తర్వులను ఆయా శాఖల అధికారులు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వారందరూ తప్పకుండా ఎన్నికల శిక్షణకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. సంబంధిత రిటర్నింగ్ అధికారులు ఎంపికైన పోలింగ్ సిబ్బంది పీఓలు, ఏపీఓలకు తెలపాలన్నారు. పోలింగ్‌కు నియమితులైన వారందరూ శిక్షణకు వచ్చేటపుడు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫామ్-12ను పూరించి వచ్చేలా ఆర్ఓలు చూసుకోవాలన్నారు.

ఈ నెల 5, 7, 14వ తేదీల్లో శిక్షణ

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఎంపికైన పీఓలు, ఏపీఓలకు ఈనెల 5, 7, 14వ తేదీల్లో శిక్షణ ఏర్పాటు చేయాలని కలెక్టరు గౌతమి ఆర్ఓలను ఆదేశించారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గం (ప్రభుత్వ జూనియర్ కళాశాల), రాయదుర్గం (రాయదుర్గం ప్రభుత్వజూనియర్ కలాశాల), ఉరవకొండ (ఉరవకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల), గుంతకల్లు (గుంతకల్లు సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్) తాడిపత్రి (తాడిపత్రి పాలిటెక్నిక్ కాలేజ్), శింగనమల (బుక్కరాయసముద్రం ఆర్డీటీ హియరింగ్ స్కూల్), కళ్యాణదుర్గం (కళ్యాణదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాల) రాప్తాడు (పంగల్ రోడ్డు టీటీడీసీ భవనం)లో శిక్షణ ఏర్పాటు చేసినట్లు కలెక్టరు తెలిపారు.



పోలింగ్ సిబ్బంది జాబితాను పరిశీలిస్తున్న కలెక్టరు గౌతమి

'స్పాట్'కు రాం...రాం ...!

● 30 శాతం అదనంగా వేసినా... బేజారు
● స్పెషల్ అసిస్టెంట్లు చాలావరకు డుమ్మా
● డీఈఓ వరలక్ష్మి ఆగ్రహం
● తర్వాత ఒక్కొక్కరుగా విధుల్లోకి..
● సాయంత్రానికి కొలిక్కి..

అనంతపురం విద్య, ఏప్రిల్ 1: పదో తరగతి పరీక్షల మూల్యాంకనానికి మెజార్టీ ఉపాధ్యాయులు రాం..రాం అంటూ మారాం చేశారు. మధ్యాహ్నం 2 గంటల వరకూ అదే పరిస్థితి. ముఖ్యంగా స్పెషల్ అసిస్టెంట్లు చాలా మంది గైర్హాజరయ్యారు. అయితే ఉత్తర్వులు జారీ అయిన వారు విధుల్లో చేరకుంటే... మెమోలు ఇస్తామంటూ డీఈఓ కఠినంగా వ్యవహరించడంతో తర్వాత టీచర్లు ఒక్కరొక్కరుగా విధుల్లో చేశారు. సాయంత్రానికి సమస్య కొలిక్కి వచ్చింది. పదో తరగతి పరీక్షల మూల్యాంకనం సోమవారం నుంచి ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని కేఎస్ఆర్ హైస్కూల్, కేఎస్ఆర్ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని పలు గదుల్లో స్పాట్‌కు ఏఈలు, సీఈలు, స్పెషల్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది 1154 మందిని నియమించారు. 835 మంది ఏఈలు, సీఈలకు గాను మధ్యాహ్నం 2 గంటల వరకూ కేవలం 562 మంది మాత్రమే ఎగ్జామినర్లు రిపోర్ట్ చేసుకున్నారు.



పది పరీక్ష పేపర్ల మూల్యాంకనం చేస్తున్న ఉపాధ్యాయులు

తెలుగు సబ్జెక్టుకు సంబంధించి 118 మందికిగాను 88 మంది, హిందీ 91 మందికి గాను 73మంది, ఇంగ్లీష్ 92 మందికిగాను 89 మంది, గణితం 82 మందికిగాను 81 మంది, ఫిజికల్ సైన్స్ 88మందిగాను 80 మంది, బయాలజీ 75 మందిలో 67 మంది, సోషల్ 100 మందిలో 84 మంది మాత్రమే హాజయ్యారు. కావాల్సిన సిబ్బంది కంటే 30 శాతం మందిని అదనంగా నియమించినా, వివిధ కారణాలు చూపుతూ మెజార్టీ ఎగ్జామినర్లు విధుల్లో చేరకుండా చెట్ల కింద కూర్చొని, ఎలాగైనా మినహాయింపు ఇస్తారన్నట్టుగా చాలా మంది చూస్తూ వచ్చారు. డీఈఓ వరలక్ష్మి గట్టిగానే హెచ్చరించారు. చంటి బిడ్డలు ఉన్న తల్లులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఇతరవైద్య సమస్యలున్న వాళ్లకు మాత్రమే మినహాయింపు ఇస్తామని, మిగిలిన వారంతా హాజరు కావాలంటూ హెచ్చరించారు. ఉత్తర్వులు అందుకుని, సహేతుక కారణాలు లేకుండా పరీక్షల మూల్యాంకనం డ్యూటీ నుంచి మినహాయింపు పొందాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. మెమోలు జారీ చేస్తామన్నారు. దీంతో తమ పరిధిలోని ఉపాధ్యాయులను వెంటనే విధుల్లో చేరేలా చూడాలని ఎంఈఓలను సైతం డీఈఓ ఆదేశించారు. సాయంత్రానికి ఒక్కరొక్కరుగా విధుల్లో చేరడంతో...అధికారులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ స్పాట్ విధులకు నియమించిన సిబ్బంది పూర్తిస్థాయిలో హాజరయ్యారని, నిజమైన అనారోగ్య సమస్యలు, చంటి బిడ్డల తల్లులు వంటి వారికి మినహాయింపు ఇచ్చామన్నారు. ఏదైనా సబ్జెక్టుకు అవసరం ఉన్నచోట.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీ గోవింద్‌నాయక్, డిప్యూటీ డీఈఓ శ్రీదేవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



స్పాట్‌కు హాజరైన వారి వివరాలు తెలుసుకుంటున్న డీఈఓ వరలక్ష్మి

తాగునీటి కోసం రోడ్డెక్కిన ప్రజలు

● 300 ఇళ్లకు నీటి కష్టాలు
● ఎమ్మెల్యే సొంతమండలంలోనే నీటి ఎద్దడి

నల్లమాడ, ఏప్రిల్ 1: మండల కేంద్రంలోని పుట్టపర్తి, కదిరి ప్రధాన రహదారిలో ప్రజలు తాగునీటి సమస్య పరిష్కరించాలని సోమవారం రోడ్డెక్కారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ పరిధిలో రోడ్డు కిరువైపులా 300 ఇళ్లు ఉన్నాయని, నెలరోజుల నుంచి తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సొంత మండలంలోనే తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయరు. సమస్యను పరిష్కరించాలని పంచాయతీ అధికారులకు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రగతి బ్యాంకు వద్ద ఉన్న బోరు చెడిపోవడం సమస్యగా మారిందన్నారు. నల్లమాడ క్రాస్ వద్ద నున్న బోరుబావి నుంచి మూడు రోజులకు ఒకసారి పంచాయతీ అధికారులు నీటిని వదిలేవారన్నారు. ఆ బోరులో నీరు అడుగంటిపోవడంతో క్రాస్ వద్దనున్న కాలనీవాసులు గేట్‌వాల్‌ను ఈ కాలనీవైపు తిప్పకూడదని చెప్పడంతో పంచాయతీ కార్మికులకు చెప్పడంతో వారు నీటిని నిలిపివేశారన్నారు. దీంతో నెలరోజులుగా తాగునీరు లేక అల్లాడిపోతున్నామన్నారు. విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శశికళ సంఘటనా స్థలానికి చేరుకుని, మహిళలతో మాట్లాడుతూ రెండు మూడు రోజుల్లో కాలనీలో ఉన్న బోరుకు మరమ్మతు చేయించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు.



పుట్టపర్తి-కదిరి రహదారిపై ఉంచిన ఖాళీ బిందెలు

జిల్లాలో 2.89 లక్షల మందికి పింఛన్

● రూ.86.58కోట్లు మంజూరు



అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 1: ఏప్రిల్ నెలకు సంబంధించి జిల్లాకు 2,89,131 మంది లబ్ధిదారులకు పింఛన్ మంజూరు చేశారు. మొత్తం రూ.86.58 కోట్లు నిధులు విడుదల చేశారు. ఇందులో వృద్ధులు 1,45,839 మందికి గాను రూ.43.75కోట్లు, వితంతువులు 66,868 మందికి రూ.20 కోట్లు, విభిన్నప్రతిభావంతులు 46,664 మందికి రూ.13.99 కోట్లు, చేనేతలు 6,793 మందికి రూ.2 కోట్లు, ఒంటరి మహిళలు 6,744 మందికి రూ.2 కోట్లు, అభయహస్తం 4,273 మందికి రూ.21లక్షలు, కల్లుగీత కార్మికులు 3,532మందికి రూ.1.06కోట్లు, మెడికల్ 3,271 మందికి రూ.1.64కోట్లు, డప్పు కళాకారులు రూ.94 లక్షలు, మత్స్యకారులు 893 మందికి రూ.26 లక్షలు, సఫాయి కర్మాచారులు 356 మంది రూ.10 లక్షలు, సీకేడీయూ 347 మందికి రూ.34 లక్షలు, హిజ్రాలు 208 మందికి రూ.62 వేలు, కళాకారులు 185 మందికి రూ.56 వేలు, సైనికవెల్ఫేర్ 6 మంది రూ.3వేలు మంజూరు చేశారు. పెన్షన్ మంజూరైన లబ్ధిదారులు ఈనెల 3వ తేదీ నుంచి ఆయా గ్రామ-వార్డు సచివాలయాల వద్ద పింఛన్ నగదు తీసుకోవాలని డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ నరసింహారెడ్డి తెలిపారు.



విద్యాశాఖ ఆర్జేడీకి వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

మూల్యాంకన వేతన బకాయిలు చెల్లించాలి

ఏపీటీఎఫ్, యూటీఎఫ్ డిమాండ్



డీఈఓకి వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కొత్తచెరువు, ఏప్రిల్ 1: మూల్యాంకన వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఉపాధ్యాయ సంఘాలు ఏపీటీఎఫ్, యూటీఎఫ్ డిమాండ్ చేశాయి. 2022-2023 విద్యాసంవత్సరంలో పదో తరగతి మూల్యాంకన వేతన బకాయిలు ఇంతవరకు చెల్లించకపోవడం శోచనీయమని ఆయా సంఘాల నాయకులు పేర్కొన్నారు. వెంటనే వాటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్షప్రధానకార్యదర్శులు శ్రీనివాసులు, ఆర్ చంద్ర, గౌరవాధ్యక్షుడు పీవీ మాధవ తదితరులు సోమవారం ఆర్జేడీ రాఘవరెడ్డికి స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు కూడా అక్కడే డీఈఓ మీనాక్షికి వినతి ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా వేతన బకాయిలు రూ.23 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. ఏడాది గడిచినా ప్రభుత్వం రెమ్యూనేషన్ చెల్లించకపోవడం సమంజసం కాదన్నారు. పాతది చెల్లించకుండానే తిరిగి స్పాట్‌కి తమకు ఎలా నియమిస్తారని మండిపడ్డారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల విజేత ఏపీ జట్టు



విజేతగా నిలిచిన ఏపీ రాష్ట్ర సబ్‌జూనియర్ బాలుర జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 1: జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఏపీ జట్టు విజేతగా నిలిచింది. ఐదు రోజుల పాటు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఔరంగబాద్‌లో నిర్వహించిన 36వ జాతీయ సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఇందులో ఫైనల్‌లో అతిథ్య జట్టు మధ్యప్రదేశ్‌పై 02-12 పాయింట్ల తేడాతో విజయం సాధించిన ఏపీ బాలుర జట్టు విజేతగా నిలిచింది. 21 జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో ఓటమిలేకుండా ఫైనల్ వరకు విజయాలు అందుకున్న ఏపీ జట్టు చాంపియన్‌షిప్ ట్రోఫీ సాధించడం అభినందనీయమని ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు అన్నారు. జాతీయ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ ప్రవీణ్ అనౌకర్, కార్యదర్శి ఎల్‌ఆర్ మౌర్య, కోశాధికారి శ్రీకాంత్ తోరాట్, సహాయ కార్యదర్శులు తవాల్కర్, వెంకటేశులు విజేత జట్టుకు అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్ర, కోచ్‌లు మహేష్, సింహాద్రి, లక్ష్మి, బద్రి, సురేష్ పాల్గొన్నారు.

జాతీయ లాక్రోస్ పోటీల్లో రాష్ట్రానికి ద్వితీయ స్థానం



జాతీయ లాక్రోస్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన జిల్లా క్రీడాకారులు

జాతీయ లాక్రోస్ పోటీల్లో రాష్ట్రానికి ద్వితీయ స్థానం దక్కింది. ఐదు రోజులుగా ఆగ్రాలో నిర్వహించిన జాతీయ లాక్రోస్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్ర బాలుర జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు జిల్లా లాక్రోస్ అసోసియేషన్ కార్యదర్శి రాధిక, కోశాధికారి లింగప్రసాద్ అభినందనలు తెలిపారు.

ఎల్ఈడీ బల్బుల డబ్బు ఇవ్వలేం : సర్పంచ్

శింగనమల, ఏప్రిల్ 1: ఎల్ఈడీ బల్బుల నిర్వహణ గ్రామ పంచాయతీతో ఎలాంటి సంబంధమూ లేదనీ, తాము డబ్బు ఎందుకు చెల్లించాలని జూల్కా కాలువ సర్పంచ్ తరిమెల రాజారెడ్డి అధికారులను నిలదీశారు. సోమవారం శింగనమల ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో గ్రామాల్లో వీధిదీపాల నిర్వహణ డబ్బులను ఎల్ఈడీ బల్బులు ఏజెన్సీనే చూసుకునేదని, వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ ఏజెన్సీ రద్దు చేసి తొలగించారని అన్నారు. గత నెల నుంచి గ్రామ సర్పంచ్‌లు ఎల్ఈడీ బల్బులు మెయింటెనెన్స్ డబ్బులు చెల్లించా లని ఉత్తర్వులు వచ్చాయని, దీంతో తమకు సంబంధంలేని, బిల్లులు తాము చెల్లించేది లేదని తేల్చిచెప్పారు. ఎంపీడీఓ బీ.వెంకటరమణ మాట్లాడుతూ.. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. పెద్ద మంటగొంది సర్పంచ్ పార్నపల్లి రమేష్ మాట్లాడుతూ... వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీరు కొరత లేకుండా నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ యోగశ్వరి, వైస్ ఎంపీపీ నరసింహులు, అధికారులు సీడీపీఓ ఉమాశంకరమ్మ, ఏఓ అన్వేష్, నరసింహరాజు పాల్గొన్నారు.

పరిశోధనలే ప్రతిభకు గీటురాయి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అనంతరాముడు

అనంతపురం సెంట్రల్ : ఎంచుకున్న అంశంపై వివిధ కోణాల్లో ఆలోచించి వాటిపై పరిశోధనలే విద్యార్థుల ప్రతిభకు గీటురాయని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అనంతరాముడు పేర్కొన్నారు. పులివెందుల జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన సింపోజియంలో అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా వారిని సోమవారం అనంతరాముడు అభినందించి సర్టిఫికెట్స్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సదస్సు సింపోజియం, ప్రాజెక్టుల ప్రదర్శన వేదికలు విద్యార్థుల ఆలోచనలు బహిర్గతం చేయడానికి ఎంతో దోహదపడు తాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామమూర్తి, ఈసీఈ విభాగాధిపతి అజయ్‌కుమార్, అధ్యాపకులు బాబు పాల్గొన్నారు.

అధిక ఇంధనం వాడకంతో ముప్పు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 1: ఇటీవల యంత్రాలు, వాహన వినియోగం బాగా పెరిగిందని, అయితే వాటికివాడే ఇంధన వినియోగం కూడా పెరగడంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ఉద్గారాల వినియోగ రహితం' అనే అంశంపై నిర్వహించిన టెక్నికల్ వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. భూ ఉష్ణోగ్రతల్లో వస్తున్న దీర్ఘకాలిక మార్పులతో అనేక నష్టాలు వాటిల్లుతున్నా యన్నారు. తీవ్ర వర్షాభావం, వరదలు, అడవులు అంతరించిపోవడం, సముద్ర మట్టాలు పెరగడం, పంటల దిగుబడి తగ్గటం, ఆహార కొరత ఇలా అనేక రకాల ప్రమాదాలు మానవ మనుగడను ప్రశ్నార్థకంగా మార్చుతున్నాయన్నారు. వీటిని అరికట్టాలంటే మానవ కార్యకలాపాల్లో ఇంధన వినియోగం తగ్గాలని సూచించారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కళ్యాణిరాధ, వరంగల్ ఎన్ఐటీ మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ వీరేష్‌బాబు, డాక్టర్ ఓం ప్రకాష్, సీఎస్ఈ విభాగాధి భారతి పాల్గొన్నారు.

'ప్రత్యేక' పిల్లలకు ఉచితంగా పరికరాలు

అనంతపురం విద్య : జిల్లాలోని ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా పరికరాలు అందించినట్లు ఏపీసీ వరప్రసాద్ పేర్కొన్నారు. ఆ పిల్లల కోసం సమగ్రశిక్ష ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా మెడికల్ అసెస్మెంట్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీసీ గుత్తి మండలంలోని భవిత కేంద్రంలో జరుగుతున్న మెడికల్ క్యాంపు తనిఖీ చేసిన ఏపీసీ మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఐదు కేంద్రాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుత్తిలో దాదాపు 150 మంది పిల్లలకు వైకల్య పరీక్షలు నిర్వహించామన్నారు. పిల్లల వైకల్య తీవ్రతను బట్టి వారికి ఉచితంగా అధునాత పరికరాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఐఈడీ అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ షమ, అలెస్కో కో-ఆర్డినేటర్ గోవిందరెడ్డి, గుత్తి ఎంఈఓ మనోహర్ పాల్గొన్నారు.

నాకు రాజకీయాలు కొత్తకాదు

నా అభ్యర్థిత్వంపై టీడీపీలో ఎవరికీ అసంతృప్తి లేదు: దగ్గుబాటి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 1: తనకు రాజకీయాలు కొత్తకాదని.. దాదాపు 20 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్నానని టీడీపీ అనంతపురం అర్బన్ అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. నగరంలోని పలువురు టీడీపీ ముఖ్యనాయకులను సోమవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాప్తాడు ఎంపీపీగా ఐదేళ్లు పనిచేశానని, ఎమ్మెల్యే అభ్యర్థిత్వం మాత్రమే కొత్తదని అన్నారు. డివిజన్ స్థాయి కార్యకర్త నుంచి నగరంలోని నాయకులందరినీ కలిసి సమన్వయంతో ముందుకు వెళతానని అన్నారు. తన అభ్యర్థిత్వంపై ఎవరికీ అసంతృప్తి లేదన్నారు. తన విజయానికి ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేస్తారన్న నమ్మకం తనకుందన్నారు. టీడీపీ శ్రేణులతోపాటు జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తన గెలుపు కోసం పనిచేసేందుకు సిద్ధంగా ఉండటం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. వైసీపీలోని కొందరు నాయకులు టీడీపీలోకి చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటికే రుద్రంపేట పంచాయతీ నాయకులు నరేందర్‌రెడ్డి, ఆయన అనుచరులు టీడీపీలో చేరారన్నారు. మరికొంత మంది త్వరలోనే చేరబోతున్నారని అన్నారు. అందరినీ కలుపుకొని అనంత అర్బన్‌లో టీడీపీ జెండాను ఎగురవేస్తామన్నారు. చంద్రబాబుకు అనంత అర్బన్ సీటును గిఫ్ట్‌గా ఇస్తామన్నారు.

పలువురు ముఖ్యనాయకులతో భేటీ: దగ్గుబాటి ప్రసాద్ సోమవారం పలువురు ముఖ్యనాయకులతో భేటీ అయ్యారు. మాజీ మేయర్ స్వరూప, అనంతపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళీధర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళీ, టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్, టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సైఫుద్దీన్, షకిల్ షఫి, వసంతనాయుడు, కృష్ణకుమార్, నెట్టం బాలకృష్ణ, మునీంద్రా, రాజా, శ్రీనివాసులు, వడ్డే హరి తదితరులను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు.



మాజీ మేయర్ స్వరూపను కలిసిన దగ్గుబాటి ప్రసాద్





జేఎల్ మురళీధర్, రాయల్ మురళీని కలిసిన టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్

ఆటో బోల్తా.. పాత్రికేయులకు గాయాలు

ముదిగుబ్బ, ఏప్రిల్ 1: ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో ఇద్దరు పాత్రికేయులకు తీవ్ర గాయాలవగా, మరో ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. కదిరిలో సోమవారం జరిగిన సీఎం జగన్ బస్సు యాత్ర కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు ఆర్ టీవీ స్టాఫర్ చల్లా కే నాయుడు, ఫొటో గ్రాఫర్ సుధాకర్ వెళ్లారు. కవరేజీ అనంతరం వారు ఆటోలో తిరిగి అనంతపురానికి బయలుదేరారు. ముదిగుబ్బ మండలం ఎస్ఎస్‌పీ కొట్టాల సమీపంలో ఆటో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో చల్లా కే నాయుడి, సుధాకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. మరో ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చల్లాకేనాయుడును మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు అనంతపురం తరలించారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాత్రికేయుడు

ప్రతి చెరువుకూ సాగునీరు..!

అనంతపురం రూరల్, ఏప్రిల్ 1: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలోని ప్రతి చెరువుకూ సాగునీరు.. ప్రతి గ్రామానికి తాగునీరు ఇవ్వడమే లక్ష్యంగా పనిచేస్తానని మాజీ మంత్రి పరిటాల సునీత హామీ ఇచ్చారు. చిన్నంపల్లి, సంతోష్‌నగర్, బీసీ కాలనీ, కామారుపల్లిలో సోమవారం ఆమె ప్రచారం చేశారు. కురుగుంట పంచాయతీలోని వైఎస్సార్ కాలనీ, ఎస్సీకాలనీలో ప్రచారం చేశారు. నియోజకవర్గంలో హంద్రీనీవా కాలువ ఉన్నా.. ఏ రోజూ చెరువులకు నీరు ఇచ్చిన దాఖలాలు ఈ ఐదేళ్లలో లేవని అన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాత్రం అన్ని చెరువులకు అందించానని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. ఐదేళ్ల పాటు అవినీతి మత్తులో ఉన్న ప్రకాష్‌రెడ్డి ఇప్పుడే నిద్రలేచి రూరల్ కాలనీలకు తాగునీరు ఇస్తామంటూ బయలుదేరారని ఎద్దేవా చేశారు. ఇలాంటి మోసపూరిత నాయకులను ఇంటికి పంపే సమయం వచ్చిందన్నారు. ప్రజలంతా ఆలోచించి ఓటు వేయాలన్నారు. చిన్నంపల్లి పంచాయతీ సంతోషనగర్‌కు చెందిన మైనార్టీ నాయకులు అల్లాబకాష్, షేక్ ఫజల్‌ఖాన్, షబ్బీర్, ఫక్రుద్దీన్‌లోకి చేరారు.



చిన్నంపల్లిలో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న పరిటాల సునీత

టీడీపీతోనే మాదిగల అభివృద్ధి

అనంతపురం సెంట్రల్ : టీడీపీ ప్రభుత్వంతోనే మాదిగల అభివృద్ధి సాధ్యమని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లా అధికార ప్రతినిధి అక్కులప్ప పేర్కొన్నారు. కురుగుంటలో రాప్తాడు టీడీపీ అభ్యర్థి పరిటాల సునీతను సోమవారం ఆయన కలిశారు. టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వేలాది మంది మాదిగలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ఆర్థిక స్వాలంబన చేకూర్చారన్నారు. వాటిని రద్దుచేసిన వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి మాదిగలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు రాజు, ఉదయ్‌కుమార్, సంతోష్ పాల్గొన్నారు.

వైసీపీ చేసిన అభివృద్ధి శూన్యం

ఎన్నికల ప్రచారంలో టీడీపీ నాయకులు

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : ఒట్టి ప్రచారాలే తప్పా... ఈ ఐదేళ్ల పాటూ వైసీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని టీడీపీ నాయకులు మండిపడ్డారు. సోమవారం పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాప్తాడు మండలంలోని పుల్లలరేవులో టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళీ, కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ సాయినాథ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. అలాగే కనగానపల్లి మండలం చంద్రాచర్ల గ్రామంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, కన్వీనర్ యాతంపోతలయ్య, తెలుగు యువత బట్టాసురేష్‌చౌదరి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఆత్మకూరుకు చెందిన వైసీపీకి చెందిన పది కుటుంబాలు సోమవారం టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, మండల టీడీపీ ఇన్‌చార్జి బాలాజి సమక్షంలో టీడీపీలో చేరాయి.



పుల్లలరేవులో ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నాయకులు



చంద్రాచర్లలో ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నాయకులు.



ఆత్మకూరులో టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

రెగ్యులర్ డీఈఈగా శ్రీనివాసమూర్తి

అనంతపురం, సిటీ, ఏప్రిల్ 1: జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని అనంతపురం, శింగనమల పీఆర్ఐ రెగ్యులర్ డీఈఈగా అదేశాఖ పరిధిలోని స్థానిక పీఆర్ఐ ఈఈ కార్యాలయంలో ఈఈపీఏగా పనిచేస్తున్న శ్రీనివాసమూర్తిని నియమిస్తూ ఆశాఖ ఎస్ఈ ఈరస్వామి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన రెగ్యులర్ డీఈఈగా బాధ్యత లు స్వీకరించారు. కాగా.. ఈయన ఈఈపీఏ విధులతో పాటు శింగనమల, అనంతపురం డీఈఈగా నిర్వహిం చాల్సి ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



నాయీబ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యురాలిగా అక్కమ్మ



అనంతపురంరూరల్, ఏప్రిల్ 1: తెలుగుదేశం పార్టీ అనుబంధ కమిటీ నాయీబ్రాహ్మణ సాధికార కమిటీ సత్యసాయి జిల్లా కమిటీ సభ్యురాలుగా మండలంలోని పాపంపేటకు చెందిన ఎం.అక్కమ్మ నియమితులయ్యారు. ఆ మేరకు సోమవారం కమిటీ రాష్ట్రకన్వీనర్ వైద్యం శాంతారం నియామక ఉత్తర్వుల పత్రాలు అందజేశారు. ఈనేపథ్యంలో కమిటీ సభ్యులతో కలసి ఆమె నగరంలోని మాజీ మంత్రి పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో మర్యాదాపూర్వకంగా కలిశారు. ఈకార్యక్రమంలో కమిటీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రాప్తాడు నియోజకవర్గం సభ్యులు కొడిమి రామకృష్ణ, నాయకులు సీఎం రాజు, కొండన్న, దామోదర పాల్గొన్నారు.

కార్యకర్తల మనోభావాలు పరిగణనలోకి తీసుకోండి

ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డికి వైకుంఠం వర్గీయుల విన్నపం



ఎమ్మెల్సీ ఎదుట తమ ఆవేదనను వ్యక్తంచేస్తున్న కార్యకర్తలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 1: కార్యకర్తల మనోభావాలు పరిగణలోకి తీసుకొని అనంతపురం అర్బన్ టీడీపీ ఎమ్మెల్యే టికెట్‌ను వైకుంఠం ప్రభాకర్ చౌదరికి కేటాయించాలని ఆయన వర్గీయులు ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని కోరారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి కలిసి.. కొద్దిసేపు పలు అంశాలపై చర్చించారు. అనంతరం బయటకు వచ్చిన రాంగోపాల్‌రెడ్డి ఎదుట పలువురు నాయకులు, కార్యకర్తలు తమన ఆవేదనను వెలిబుచ్చారు. ఐదేళ్లు పార్టీ కోసం పనిచేసిన ప్రభాకర్ చౌదరికి టికెట్ కేటాయించాలని కోరారు. తమ అభిప్రాయాన్ని పార్టీ అధిష్ఠాం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ఇందుకు ఆయన స్పందిస్తూ కార్యకర్తలు చెప్పిన విషయాన్ని పార్టీ పెద్దలకు వివరిస్తానని హామీ ఇచ్చారు.

చైతన్యంతోనే మూఢనమ్మకాలకు చెక్: జేవీవీ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 1: సమాజంలోని ప్రజల్లో నెలకొన్న మూఢనమ్మకాలను తొలగించాలంటే అది ప్రజా చైతన్యం ద్వారా మాత్రమే సాధ్యమని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో సోమవారం పీపుల్స్ లైబ్రరీలో నిర్వహించిన మ్యాజిక్ షోలో ఆయన మాట్లాడారు. ప్రజల్లో నెలకొన్న మూఢత్వాలను, భయాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది స్వామీజీల అవతారమెత్తి మాయలు, మంత్రాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. నిజానికి ఎలాంటి మాయలు, మంత్రాలు లేవని, ఉన్నదంతా సైన్స్ ఒక్కటేనని నిజాన్ని గ్రహించాలన్నారు. తాము స్వామీజీలు అని చెప్పుకునే మోసగాళ్లనుంచి ప్రజలను రక్షించాల్సిన బాధ్యతను జన విజ్ఞాన వేదిక తీసుకుంటోందన్నారు. వీలైతే జిల్లా అంతటా పర్యటించి, విద్యాసంస్థల్లో ఇలాంటి మ్యాజిక్ షోల ద్వారా శాస్త్రీయ దృక్పథంపై అవగాహన కల్పించి, విద్యార్థులను చైతన్య పరుస్తామన్నారు. అనంతరం నిర్వహించిన మ్యాజిక్ షోలో కళాకారులు ప్రసాద్, తిప్పేస్వామి వివిధ ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో జేవీవీ సమత నాయకురాలు డాక్టర్ ప్రసూన, జిలాన్, మసూద్‌వలి, గాంగేనాయక్, రామిరెడ్డి, రామకృష్ణ, నూర్‌మహమ్మద్, మన్సూర్, శివచరణ్, నరసింహమూర్తి, వంశీ పాల్గొన్నారు.

శిశు సంరక్షణే ఎస్ఎన్‌సీయూ లక్ష్యం

అనంతపురం టౌన్, ఏప్రిల్ 1: పుట్టిన నవజాతి శిశువులు అనారోగ్యాలతో జన్మిస్తే... వారికి సరైన వైద్యం అందించి ప్రాణాలు సంరక్షించడమే ఎస్ఎన్‌సీయూ (నవజాతి శిశువు సంరక్షణ విభాగం) లక్ష్యమని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఎస్ఎన్‌సీయూ విభాగం వైద్యులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ విభాగం వైద్యులు మాట్లాడుతూ... ముగ్గురు నర్సులు, రెండు పారామెడికల్ పోస్టులు ఖాళీ ఉన్నాయని, అలాగే వసతులు కూడా సరిగా లేవని సూపరింటెండెంట్ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు వెంకటేశ్వరరావు స్పందిస్తూ తప్పకుండా సిబ్బంది నియామకం, వసతుల కల్పనపై ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరించడానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓలు వైద్యులు పద్మజ, హేమలత, చిన్నపిల్లల వైద్యుడు రవికుమార్, నోడల్ ఆఫీసర్ భాస్కర్ పాల్గొన్నారు.

శిక్షణ ప్రారంభం

అనంతపురం అర్బన్ : జిల్లాలో కొత్తగా ఉద్యోగం చేరిన విలేజ్ పశుసంవర్థక సహాయకులకు సోమవారం శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెడ్డిపల్లి ప్రాంతీయ పశుశిక్షణా కేంద్రం, జేడీ ఆఫీస్, డీడీ ఆఫీస్, సాయి నగర్ వెటర్నరీ ఆస్పత్రి, సిద్దరాంపురం పశుగ్రాస కేంద్రంలో జిల్లాలోని 285 మంది సిబ్బందికి ఆరు బ్యాచులుగా విభజించి ఈ శిక్షణ నిచ్చారు. 45 రోజులపాటు సిబ్బందికి ఈ శిక్షణ ఉంటుందని పశుసంవర్థక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ

రామగిరి, ఏప్రిల్ 1: స్థానిక ఉన్నతపాఠశాలలో స్మార్ట్ టీవీ, మధ్యాహ్న భోజనం కోసం కొనుగోలు చేసిన మూడు బస్తాల బియ్యం ప్యాకెట్లు చోరీ అయినట్లు ఆ పాఠశాల హెచ్ఎం ప్రసాద్ సోమవారం తెలిపారు. శనివారం పాఠశాలకు తాళాలు వేసుకుని వెళ్లామని, సోమవారం తిరిగి పాఠశాలకు రాగా తాళాలను పగలకొట్టి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. వాటి విలువ రూ.1.20 లక్షలు ఉంటుందన్నారు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

జూదరుల అరెస్ట్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 1: స్థానిక ఆరో రోడ్డులో శ్మశాన వాటిక సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని సోమవారం అరెస్ట్ చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.3,850 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పోస్టల్.. హోం ఓటింగ్‌పై సమీక్ష

అనంతపురం టౌన్, ఏప్రిల్ 1: పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. జిల్లా అధికారులతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే 33 విభాగాల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ జారీ చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని 85 ఏళ్ల పైబడిన వారికి హోం ఓటింగ్‌కు అవకాశం ఉంటుందని, వారికి హోం ఓటింగ్ బ్యాలెట్స్ ఇవ్వాలని సూచించారు.

● సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు కలెక్టరు గౌతమి ఆదేశించారు. చెక్‌పోస్టులలో నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

'గ్రూప్ -1'లో అవకతవకలపై చర్యలు తీసుకోండి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 1: గ్రూప్-1 పోస్టుల భర్తీలో అవకతవకలకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగు యువత నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అనంతపురం రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వైసీపీ ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమైందన్నారు. గ్రూప్ -1 పోస్టుల కోసం అనేక మంది అభ్యర్థులు కష్టపడి చదివారని, అలాంటి పోస్టుల భర్తీలో అవకతవకలకు పాల్పడటం హేయమని అన్నారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చూడటంతోపాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, అధికార ప్రతినిధి వెంకటరామయ్య, నాయకులు వేణు, బొమ్మినేని శివ, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం సెంట్రల్: ఏపీపీఎస్సీ అవకతవకలపై చైర్మన్ గౌతమ్ సవాంగ్, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణరెడ్డిపై 420 యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని టీఎన్ఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఇటుకలపల్లిలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పరిపాలనాధికారుల నియామకం పాదర్శకంగా చేపడితేనే ప్రజలకు న్యాయం జరుగుతుం దన్నారు. కంచే చేనును మేసిన చందంగా ఏపీపీఎస్సీ పరీక్షల ఎవాల్యు యేషన్‌లో గౌతమ్ సవాంగ్, జగన్‌రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి అక్రమాలకు పాల్పడి అర్హులను అన్యాయం చేశారని ఆరోపించారు. భౌతికంగా చేసిన మూల్యాంకం ఫలితాలను పక్కనపెట్టి కంప్యూటర్‌తో ఆటోమేటిక్ మూల్యాంకణం చేయించి ఫలితాలను విడుదల చేశారన్నారు. ఈ క్రమంలో ఒక్కో అభ్యర్థి నుంచి రూ.కోట్లు దండుకుని చేతివాటం ప్రదర్శించారని మండిపడ్డారు. ప్రతిభకలిగిన లక్షలాది మంది నిరుద్యోగులను రోడ్డునపడేసి అమ్యామ్యాలు ఇచ్చినవారికే పోస్టులు కట్టబెట్టారని ఆరోపించారు. ఏపీపీఎస్సీ నియామకాలు పారదర్శకంగా చేపట్టేవరకు తమ ఉద్యమం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్, కిరణ్, పురుషోత్తం, నరేష్, మనోహర్, శివ, రాజు, సుబ్బు, ఆనంద్ పాల్గొన్నారు.





అనంతపురంలో ఫిర్యాదు చేస్తున్న నాయకులు, ఇటుకలపల్లిలో మాట్లాడుతున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

వైసీపీవి అసత్య ఆరోపణలు

శింగనమల : పెన్షన్ వ్యవస్థపై సోషల్ మీడియాలో వైసీపీ అసత్య ఆరోపణలు మానుకోవాలని శింగనమల టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. పింఛన్.. వలంటీర్ల ద్వారా పంపిణీ చేయరాదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇవ్వగా.. దీన్ని అదునుగా తీసుకొని వైసీపీ సోషల్ మీడియాల్లో చంద్రబాబు నాయుడు పెన్షన్లు ఇవ్వకూడా అడ్డుపడ్డారని ఆసత్యప్రచారాలు చేస్తోందన్నారు. ఎన్ని అసత్య ప్రచారాలు చేసిన చంద్రబాబు నాయుడు సీఎం కావడం కాయమని, గ్రామాల్లో పెన్షన్లపై ఆసత్యప్ర చారంలో టీడీపీ శ్రేణులు తిప్పికొట్టాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు.

రామగిరి: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందు వల్ల వలంటీర్లు పింఛన్లు ఇవ్వరాదని ఎన్నికల కమిషన్ ఆదేశిస్తే... దానిని వైసీపీ టీడీపీపై రుద్ది దుష్ప్రచారం చేస్తోందని టీడీపీ నాయకులు విమర్శించారు. సోమవారం మండలంలోని పోలేపల్లి గ్రామంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ నెలలో పింఛన్‌లు సచివాలయాల వద్దకువచ్చి తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడం దుర్మార్గమైన చర్య అని వారు విమర్శించారు. సమావేశంలో టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, మండల కన్వీనర్ సుధాకర్, నాయకులు రామ్మూర్తి నాయడు, పరందామ యాదవ్, చంద్రప్ప, మాదాపురంశంకర, ప్రభాకర, మురళి, తిమ్మానాయుడు తదితరులు పాల్గొన్నారు.

చీనీకాయలు టన్ను రూ.28 వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 1: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.28,500, కనిష్ఠంగా రూ.12,500, సరాసరి రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 926 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నీటి సమస్యపై స్పందించని పాలకులు

ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్



ఎమ్మెల్యేను గజమాలతో సన్మానిస్తున్న చేనేత నాయకులు

ఉరవకొండ, ఏప్రిల్ 1: తాగునీటి సమస్యపై పాలకులు, అధికారులు స్పందించడం లేదని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని చౌడేశ్వరి కాలనీ, అంబేడ్కర్, ఇందిరానగర్‌లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అంతకుముందు చౌడేశ్వరి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చేనేత సంఘం నాయకులు భారీ గజమాలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. కాలనీలోని చేనేత కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైకిలు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో చందారాము, పెద్దకోట్ల శ్రీన, బీరే శేఖర్, పల్లా నరసింహులు, ప్రభాకర్, శివ, వీరేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తనయుల ప్రచారం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పయ్యావుల కేశవ్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే తనయులు విక్రమ్‌సింహా, విజయ్‌సింహా, వేర్వేరుగా ప్రచారాలు నిర్వహించారు. విడపనకల్లు మండలంలోని మాలాపురం, జనార్దనపల్లి గ్రామాలలో విజయ్‌సింహా ప్రచారం చేశారు. వజ్రకరూరు మండలంలోని ప్యాపిలీలో విక్రమ్‌సింహా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మారయ్య, కరణం హేమలత, దేవేంద్ర, రాజు, ధనుంజయ, కావేటి, అశోక్, రాధాకృష్ణ, వజ్రకరూరు మండల నాయకులు నూతేటి వెంకటేష్, నాగేంద్ర, నాగన్న, వన్నూరుస్వామి, సుధాకర్ పాల్గొన్నారు.

'గుమ్మనూరు' సమక్షంలో టీడీపీలో చేరిక



కంబగిరి రామును పార్టీలోకి ఆహ్వానిస్తున్న జయరాం

గుంతకల్లు, ఏప్రిల్1: పట్టణంలో వైసీపీకి చెందిన పలువురు నాయకులు సోమవారం సాయంత్రం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం సమక్షంలో టీడీపీలో చేరారు. కసాపురం రోడ్డులోని టీడీపీ కార్యాలయం వద్దకు వచ్చిన వైసీపీ నాయకుడు, 13 వార్డు కన్వీనరు కంబగిరి రాము, చక్రపాణి, శ్రీనివాసులు, ఆంజనేయులు, తదితర 20 కుటుంబాల వారికి పార్టీ కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు ఈశ్వర్, గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణ స్వామి పాల్గొన్నారు.

గుమ్మనూరు విజయానికి కృషి చేయండి

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 1: గుంతకల్లు టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని టీడీపీ వాల్మీకి సాధికారిక కమిటీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌నాయుడు పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వాల్మీకులకు అత్యధిక స్థానాలు కేటాయించినందుకు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. పట్టణంలో వైసీపీ దౌర్జన్యాలు, అరాచకాలు, భూకబ్జాలను ఎదుర్కోవాలంటే ఐక్యంగా పోరాడాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

బెళుగుప్ప, ఏప్రిల్ 1: మండలంలోని కాలువపల్లి వద్దనున్న పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి సోమవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

టీడీపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయండి



పార్టీలో చేరిన వారితో జేసీ ప్రభాకర్‌రెడ్డి

పెద్దవడుగూరు, ఏప్రిల్1: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. సోమవారం మండలకేంద్రంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను గుర్తు పెట్టుకొని తగిన సముచిత స్థానం కల్పిస్తానన్నారు. కార్యకర్తలే పార్టీకి బలం అని తెలిపారు. అనంతరం రావులుడికి గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాజీ స్టోర్‌డీలర్ సాంబశివారెడ్డి, పది కుటుంబాలు జేసీపీఆర్ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, గంగరాజుయాదవ్, దివాకర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, తిమ్మయ్య, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో పర్యటించిన జితేంద్రగౌడు



పాతకొత్తచెరువులో అభిమానులతో జితేంద్రగౌడు కరచాలనం

గుంతకల్లు, ఏప్రిల్1: మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు సోమవారం నుంచి ఆత్మీయ యాత్రను ప్రారంభించారు. టీడీపీ ఈయనకు టిక్కెట్టు ఇవ్వకపోవడంతో తన అనుయాయులను కలవడానికి ఆత్మీయ యాత్రను ప్రారంభించారు. మండలంలోని పాతకొత్తచెరువు, గొల్లలదొడ్డి, వైటీ చెరువు, గుత్తి పట్టణంలోని కార్యకర్తలను, నాయకులను కలిసి సమావేశాలను నిర్వహించారు. తన భవిష్యత్ కార్యాచరణకు సహకరించాలని, అలాగే తనను నమ్ముకుని ఉన్నవారికి అన్యాయం జరక్కుండా తాను కాపాడుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో పవన్‌కుమార్ గౌడు, టీ కేశప్ప, శివన్న, శివప్ప, గిడ్డయ్య, గోపాల్, గుత్తి టౌన్ బ్యాంకు చైర్మన్ జిలాన్ బాషా, నాయకులు బద్రివలి, రవిశంకర్ గైడు, శ్రీనివాస యాదవ్, దిల్కా శీన తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటరమణస్వామి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

యల్లనూరు, ఏప్రిల్1: మండలకేంద్రంలోని లక్ష్మీ వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య మంగళవాయిద్యాలతో స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం రథోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వెండి శఠగోపం సమర్పణ

మండలకేంద్రంలోని లక్ష్మీ వెంకట రమణస్వామికి యల్లనూరుకు చెందిన కుప్పా వంశస్తులు రూ.2లక్షల విలువగల వెండి శఠగోపంను సమర్పించారు. అర్చకులు శఠగోపానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి: అమిలినేని



పార్టీలోకి చేరిన వారితో అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 1: టీడీపీ పాలనతోనే గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో నడుస్తాయని ఆపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. కంబదూరు మండలంలోని కోటగుడ్డం, అచ్చంపల్లి, అయ్యంపల్లి, కురాకులపల్లి, చెన్నంపల్లిలో సోమవారం ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అమిలినేనికి అపూర్వ ఆదరణ లభించింది. ఆయా గ్రామాల్లో అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమవుతుందన్నారు. టీడీపీ హయాంలో పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారిని ఆర్థికంగా ఆదుకున్న ఘనత చంద్రబాబునాయుడుకే దక్కిందన్నారు. ప్రతి పేదవాడు బాగుండాలనే ఉద్దేశంతో సూపర్‌సిక్స్ పథకాలను చంద్రబాబునాయుడు ప్రకటించారన్నారు. ఈ పథకాలకు ప్రజల్లో ఎంతో ఆదరణ లభిస్తోందన్నారు. వెనుకబడిన ఈ ప్రాంత అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమవుతుందన్నారు. అందుకే టీడీపీని గెలిపించాలని కోరారు.

అమిలినేని చెంతకు పది వైసీపీ కుటుంబాలు

కళ్యాణదుర్గం మున్సిపాల్టీ పరిధిలోని దొడఘట్ట గ్రామానికి చెందిన పది వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరందరికీ అమిలినేని సురేంద్రబాబు పార్టీ కండువా వేసి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. కళ్యాణదుర్గంలో టీడీపీ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని పార్టీలో చేరిన వారు ధీమా వ్యక్తం చేశారు.



అమిలినేనికి సత్కారం.. స్వాగతం

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

కుందుర్పి: టీడీపీ గెలుపే ధ్యేయంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించి కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో అమిలినేని సురేంద్రబాబుకు ఘన స్వాగతం లభించింది. ఈ ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గాన్ని సాగు, తాగునీరుతో పాటు అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే టీడీపీ లక్ష్యం: మాజీ మంత్రి కాలవ



ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, ఏప్రిల్ 1: మైనార్టీల సంక్షేమమే టీడీపీ లక్ష్యమని మాజీమంత్రి, ఆపార్టీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని షాదీ మహల్‌లో సోమవారం రాత్రి తెలుగుదేశం పార్టీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయనతో పాటు ఎంపీ అభ్యర్థి అంబిక లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కాలవ మాట్లాడుతూ హిందూ, ముస్లింలంతా అన్యోన్యంగా మెలగాలనే భావనతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ అభ్యర్థి అంబిక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ అధ్యక్షుడు గౌస్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ మంజునాథగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

రాయదుర్గం ఎనిమిదో వార్డుకు చెందిన 16 కుటుంబాలు సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరాయి. టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు నివాసంలో శివ, సాధిక్, సిద్ధిక్, శాంతలతో పాటు 12 కుటుంబాలు పార్టీలోకి చేరాయి. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి రాజు, మాజీ చైర్‌పర్సన్ ముదుగల్లు జ్యోతి పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయండి: అంబికా



ఎంపీ అభ్యర్థిని సన్మానించిన స్థానిక టీడీపీ నాయకులు

కణేకల్లు, ఏప్రిల్ 1: ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు చిత్తశుద్ధితో పనిచేసి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ కోరారు. సోమవారం ఆయన మండలంలోని కణేకల్లు క్రాసింగ్‌లో గల టీడీపీ నాయకుడు ఆనంద్ స్వగృహంలో నాయకులు, కార్యకర్తల తో ఆయన సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ పాలనను పారద్రోలడానికి టీడీపీ కార్యకర్తలంతా సుశిక్షులైన సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ లాలెప్ప, ఆనంద్‌రాజ్, టీటీ రమేష్, మాబుసాబ్, వెంకటేశులు, చాంద్‌బాషా, చంద్రశేఖర్‌గుప్తా, కురుబ నాగరాజు, మాల్యం ప్రభాకర్, హరి, చిన్న సలీం, మహేష్, హరి, ప్రతాప్, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటి సన్నిధిలో...

గుంతకల్లు: టీడీపీ ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారా యణ కుటుంబ సమేతంగా కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయ స్వామిని సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వనగొండి విజయలక్ష్మి, వనగొంది కిరణ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీఎం మహేశ్, పద్మావతి, హేమంత్, ముష్టూరు భాస్కర్, ముష్టూరు వేదవతి, అభిషేక్, తదితరులు ఎంపీ అభ్యర్థిని కలిసి తమ మద్దతును తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యల్లనూరు, ఏప్రిల్ 1: మండలకేంద్రంలో మంగళవారం ఉదయం 8గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ పద్మనాభరెడ్డి తెలిపారు. లక్ష్మీవెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవ ం ఉంటుందని, రథం లాగే సమయంలో విద్యుత్ తీగలను తొలగిస్తామన్నారు. రథోత్సవం ముగిసిన అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని ఆయన తెలిపారు.

తాగునీటి కోసం మహిళల ఆందోళన



తాగునీటి కోసం ఆందోళన చేస్తున్న కాలనీ వాసులు

గుత్తి, ఏప్రిల్ 1: గుత్తి ఆర్ఎస్‌లోని నెంబర్-2 పాఠశాల సమీపంలోని 6వ వార్డుకాలనీకి చెందిన మహిళలు తాగునీటి కోసం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. గత రెండు నెలలుగా తాగునీరు సరఫరా కాలేదని, దీంతో తాము తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ శ్రీనివాసులుతో వాగ్వాదం చేశారు. నెలలు గడుస్తున్న కొళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయకపోతే తాము ఏమి తాగి బతకాలంటూ మండిపడ్డారు. తమ కాలనీకి తాగునీరు సరఫరా చేసేంతవరకు ఇక్కడనుంచి వెళ్లమని భీష్మించారు. దీంతో కమిషనర్ తాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం

బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 1: మండలంలోని చెలిమేపల్లి, గోవిందయ్యదొడ్డి, వేపులపర్తి గ్రామాలలో సోమవారం తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని టీడీపీ అభ్యర్థి అమిలినేని కుటుంబ సభ్యులు రాహుల్ కోరారు. కార్యక్రమంలో కురుగౌడ, నీలాస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి గెలుపుతో గ్రామాల అభివృద్ధి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 1: రాబోవు సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ అభ్యర్థిని గెలిపించి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని ఆపార్టీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ మోహన్‌రెడ్డి తెలియజేశారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలోని మడేనహళ్లి, లింగమనహళ్లి, లక్ష్మీపురం గ్రామాలలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టినటువంటి సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు గంగాధర, మల్లికార్జున, వెంకటే శు, మాజీ సర్పంచ్ తిప్పేస్వామి, రామాంజినేయులు, హనుమంతు, శివలింగ, మల్లి గౌడ, వన్నూరుస్వామి, శంకర్, బసప్ప, తాయప్ప, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన పదార్థాలు తిని 40 గొర్రెల మృతి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 1: కాలం చెల్లిన పదార్థాలు తిని 40 గొర్రెలు మృతి చెందిన సంఘటన పట్టణంలోని బుడగ జంగాల కాలనీలో జరిగింది. కాలనీకి చెందిన కాపరులు తిప్పయ్య, రామకృష్ణ అన్నదమ్ములు. వీరు గొర్రెలు మేపుకుంటూ జీవించేవారు. రోజుమాదిరిగానే ఆదివారం కూడా 200 గొర్రెల మందను కడప రోడ్డులోకి మేతకు తీసుకెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో ఒక పరిశ్రమ వద్ద కాలపరిమితి తీరిన న్యూడిల్స్‌ను గొర్రెలు తిన్నాయి. ఇంటికి చేరాక నీళ్లు తాగిన వెంటనే అస్వస్థతకు గురయ్యాయి. సోమవారం ఉదయానికి 40 గొర్రెలు మృతి చెందగా మరో 30 గొర్రెల పరిస్థితి విషమంగా ఉన్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పశుసంవర్ధకశాఖ సిబ్బంది వలి గొర్రెలను పరీక్షించారు. ఫుడ్‌పాయిజన్ కావడంతో గొర్రెలు మృతి చెందాయని ఆయన తెలిపారు. పరిస్థితి విషమంగా ఉన్న గొర్రెలకు చికిత్స అందిస్తున్నామని తెలిపారు.

కేజీబీవీలో జీసీడీఓ విచారణ

గుంతకల్లు, ఏప్రిల్ 1: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో సోమవారం ఉదయం గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసరు (జీసీడీఓ) మహేశ్వరి పలు ఆరోపణలపై విచారణ జరిపారు. విద్యార్థినులను కలిసి సమస్యలపై ప్రశ్నించారు. ఆహారం విషయంగా వచ్చిన ఫిర్యాదుల గురించి ఆరా తీశారు. సమాధానం చెప్పడానికి విద్యార్థినులు ముందుకు రాకపోవడంతో వారికి చీటిలను ఇచ్చి అందులో పేర్లు రాయకుండా ఫిర్యాదులు ఉంటే చేయాలని సూచించారు. ఆహారం బాగాలేదని, నీటి కొరత ఉందంటూ వారి నుంచి వచ్చిన ఫిర్యాదులపై కేజీబీవీ అధికారులను, ఉపాధ్యాయులను, వంటవాళ్లను పిలిచి విచారించారు. వారి సమాధానాలను రాతపూర్వకంగా తీసుకున్నారు. విద్యార్థినుల తల్లిదండ్రుల నుంచి వాంగ్మూలాలను స్వీకరించారు. ఫిర్యాదులపై త్వరలో చర్యలు తీసుకుంటామని జీసీడీఓ విద్యార్థినుల తల్లిదండ్రులకు తెలియజేశారు. విచారణలో గుంతకల్లు ఎంఈఓ-1 మస్తాన్‌రావు, ఎంఈఓ-2 సుబ్బరాయుడు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి ప్రైవేట్ ఆపరేటర్ బలి



కరెంట్ తీగలపై వేలాడుతున్న దేవశేఖర్ ఇన్‌సెట్‌లో మృతుడు దేవశేఖర్ (ఫైల్)

యాడికి, ఏప్రిల్ 1: ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంతో విద్యుదాఘాతానికి గురై దేవశేఖర్ (23) అనే ప్రైవేట్ ఆపరేటర్ మృతిచెందిన సంఘటన మండ లంలోని వేములపాడు గ్రామంలో సోమవారం జరి గింది. కోనుప్పలపాడు గ్రామానికి చెందిన జగన్నాథ్ కుమారుడు దేవశేఖర్ కరెంట్ పనుల మరమ్మతులకు వెళుతూ ప్రైవేట్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం వేములపాడు గ్రామంలో ఒక రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ హెడ్స్ పాడైపోవడంతో రైతు ట్రాన్స్‌కో లైన్‌మన్ అశోక్‌కుమార్‌కు ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేశాడు. ఆయన సెలవులో ఉండటంతో, ప్రైవేట్ ఆపరేటర్ అయిన దేవశేఖర్‌ను ఆ పనులు చేయడానికి పంపించాడు. ట్రాన్స్‌కో ఏఈ ద్వారా ఎల్‌సీ తీసుకొని దేవశేఖర్ కరెంట్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేయడం ప్రారంభించాడు. ఆ సమయంలో ఎల్‌సీ తీసేసి కరెంట్ సరఫరా చేయడంతో దేవశేఖర్ విద్యుదాఘాతానికి గురై కరెంట్ తీగలపై వేలాడాడు. అక్కడే ఉన్న వారు వెంటనే కరెంట్ సరఫరాను నిలిపివేసి కొన ఊపిరితో ఉన్న దేవశేఖర్‌ను కిందకు దించారు. 108వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు దేవశేఖర్ మృతి చెందినట్లు తెలిపారు. దేవశేఖర్‌కు ఏడాదిన్నర కిందట వివాహమైంది. భార్య జయంతి మూడునెలల గర్భవతి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అభివృద్ధికి ఓటు వేయండి: జేసీ అశ్మిత్‌రెడ్డి



ముచ్చుకోటలో యువకుడితో మాట్లాడుతున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 1: అభివృద్ధికి మారుపేరు అయిన తెలుగు దేశం పార్టీకి ఓటువేయాలని ఆపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి ప్రజలను కోరారు. పట్టణంలోని పాతకోటలో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ అశ్మిత్‌రెడ్డి ఇంటింటికి తిరిగి ప్రజల యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైకిల్ గుర్తుకు ఓటువేసి గెలిపించాని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి శ్రీకాంత్‌రెడ్డి, నరేంద్రనాయుడు, చింబిలి ప్రసాద్ నాయుడు, బీజేపీ నాయకులు శింగిరి లక్ష్మీనారాయణ, రంగనాథరెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మండలంలోని ముచ్చుకోట గ్రామంలో సోమవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి, బీసీ రామకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, గుర్తి రఘునాయుడు, శ్రీకాంత్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నల్లప్ప, మహేష్‌బాబు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి: శ్రావణి శ్రీ



ప్రచారంలో పాల్గొన్న బండారు శ్రావణిశ్రీ

యల్లనూరు, ఏప్రిల్1: గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని శింగనమల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ తెలిపారు. సోమవారం మండలంలో ఆమె మేడికుర్తి, 85నిట్టూరు, పెద్దమల్లేపల్లి, పీఎం కొండాపురం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి అటకెక్కిందని తెలిపారు. టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, మండల టీడీపీ నాయకులు అనిల్‌కుమార్‌చౌదరి, చల్లా చంద్రశేఖర్‌నాయుడు, మేడికుర్తి రామకృష్ణారెడ్డి, సదాశివారెడ్డి, రామాంజనేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం



బెళుగుప్పలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

బెళుగుప్ప, ఏప్రిల్ 1: మండల కేంద్రంలో సోమవారం స్థానిక టీడీపీ నాయకులు సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టో క్యాలెండర్ పంపిణీ చేసి, సైకిల్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, జిల్లా ఉపాధ్యక్షులు పెద్దతిప్పయ్య, కంచి రాముడు, ధనుంజయ, శివ, మంజు, తిప్పేస్వామి, ఎర్రిస్వామి, ఈశ్వర తదితరులు పాల్గొన్నారు.

పెద్దపేటలో చోరీ

యాడికి, ఏప్రిల్ 1: మండలంలోని పెద్దపేట గ్రామంలో ఓ ఇంటిలో దొంగలు నాలుగుతులాల బంగారం, రూ.20వేలు ఆదివారం రాత్రి చోరీ చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన బషీర్‌బాషా, జరీనాబీ దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. సొంత పనుల నిమిత్తం రెండురోజుల కిందట ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. ఆదివారం రాత్రి దొంగలు ఇంటిలోని బీరువా పగలగొట్టి అందులోని రూ.20వేలు, నాలుగు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. సోమవారం తిరిగి వచ్చిన బాధితులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 1: ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లను ఈ నెల 3 నుంచి సచివాలయాల్లో ఉద్యోగులు పంపిణీ చేస్తారని ఎంపీడీఓ అల్లాబకాష్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సచివాలయ ఉద్యోగులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏప్రిల్, మే, జూన్ మూడునెలలు పింఛన్లను మండలంలో 14 సచివాలయాల్లో పంపిణీ చేస్తారన్నారు. మండలంలో 5,400 మంది లబ్ధిదారులు ఉన్నట్లు తెలిపారు. ఈవోఆర్డీ రంగనాయకులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 1: కుర్లపల్లి శివార్లలో మంగ పత్తా జూదము ఆడుతున్నారనే సమాచారము మేరకు ఆదివారం దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ. 3600లు, 52 పేక ముక్కలను, ఎనిమిది మోటారు సైకిళ్లను సీజ్ చేసి వారిపైన రూరల్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కళ్యాణదుర్గంలో అమిలినేనికి
అపూర్వ ఆదరణ



● బీటీపీ కాలువ సకాలంలో పూర్తి చేస్తానని హామీ ● పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు ● కరోనా సమయంలో 20 వేల మందికి పైగా సాయం ● పోలీసు, వైద్య సిబ్బంది, జర్నలిస్టులకు అమిలినేని ఆపన్న హస్తం ● వైసీపీ నుంచి టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు ● ఐదు మండలాల్లో 250 కుటుంబాలకు పైగా చేరిక



టీడీపీ కంచుకోట అయిన కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబుకు ఆదరణ రోజురోజుకు పెరుగుతోంది. ఏ గ్రామంలో చూసినా అనూహ్య స్పందన లభిస్తోంది. ఈక్రమంలోనే వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు ఊపందు కున్నాయి. నియోజకవర్గంలో వైసీపీ క్యాడర్ మొత్తం ఖాళీ అయ్యే పరిస్థితి కనబడుతోంది. ఇప్పటికే కుందుర్పి, కంబదూరు, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం, కళ్యాణదుర్గం మండల పరిధిలో సుమారు 250 కుటుంబాలకు పైగా తెలుగుదేశం పార్టీలోకి చేరాయి. కళ్యాణదుర్గంలో టీడీపీ పాలనవైపు ప్రజలంతా మొగ్గు చూపుతున్నారు. టీడీపీ అభ్యర్థి జోరుతో కళ్యాణదుర్గం నియోజకవర్గం వైసీపీలో నిస్తేజం అలముకుంది. రోజు రోజుకూ ఉత్సాహంతో టీడీపీ నాయకులు గ్రామగ్రామాన విస్తృతంగా ప్రచారం చేపడుతున్నారు. కళ్యాణదుర్గం



అమిలినేని సురేంద్రబాబుకు వీర తిలకం దిద్ది విజయం నీదేనంటూ దీవిస్తున్న వృద్ధురాలు

బీటీపీ కాలువ సకాలంలో పూర్తి చేస్తామంటూ హామీ

కళ్యాణదుర్గం నియోజకవర్గ ప్రజలకు జీవనాడి భైరవానితిప్ప ప్రాజెక్టు. బీటీపీ, కుందుర్పి బ్రాంచ్ కెనాల్ పనులు పూర్తి చేస్తే 114 చెరువులకు నీరందించవచ్చు. తాగు, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి కాలువ పనులు సకాలంలో పూర్తి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తానని అమిలినేని సురేంద్రబాబు హామీ ఇస్తున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ ప్రాంతం చాలా వెనుకబడిన ప్రాంతం. రహదారులు అధ్వానంగా వున్నాయి. ఎలాంటి అభివృద్ధి లేదు. మౌలిక సదుపాయాలు లేవు. టెక్స్‌టైల్ పరిశ్రమ ఒకటి ప్రతిపాదనలో ఉందంటున్నారని, గతంలో రఘువీరారెడ్డి ఏపీఐఐసీ ద్వారా సుమారు వెయ్యి ఎకరాల భూమిని సేకరించారని, టీడీపీ అధికారంలోకి వస్తే పరిశ్రమలు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని ఆయన గ్రామాల్లో గట్టిగా హామీ ఇస్తున్నారు. ప్రధానంగా రహదారులు, పాఠశాలలు, ఆస్పత్రులు, పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇస్తున్నారు.

అధ్వానపు రోడ్లను బాగు చేయించిన అమిలినేని

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని బ్రహ్మసముద్రం, కంబదూరు, కళ్యాణ దుర్గం రూరల్ పరిధిలో అధ్వానంగా ఉన్న రహదారుల బాగుకోసం అమిలినేని పూనుకున్నారు. గుంతలు పడ్డ రహదారులపై మట్టి వేయించి మరమ్మతులు చేయించారు. టీడీపీ అధికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంతాల రహదారులతో పాటు మున్సిపాల్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. మున్సిపాల్టీ మొత్తం అధ్వానస్థితికి చేరుకుందని, టీడీపీ అధికారంలోకి వస్తే కళ్యాణదుర్గంను మోడల్ మున్సిపాల్టీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా అమిలినేని సురేంద్రబాబు పారిశుధ్య కార్మికులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇస్తున్నారు.



బ్రహ్మసముద్రం మండలంలో గుంతలమయమైన రోడ్డుకు జేసీబీతో మట్టి వేయిస్తున్న టీడీపీ నాయకులు



కళ్యాణదుర్గం మండలం నుసికొట్టాలలో గుంతల రోడ్డుకు మట్టి వేస్తున్న టీడీపీ నాయకులు

ఐదు వేల మందికి పైబడి ముస్లింలకు ఇఫ్తార్ విందు

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో సుమారు ఐదు వేల మందికి పైబడి ముస్లింలకు అమిలినేని సురేంద్రబాబు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ప్రతి యేటా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇస్తూ వారి అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ముస్లింల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇస్తున్నారు. దాంతో పాటు ఎంతో మంది పేదలను ఆదుకునేందుకు అమిలినేని సురేంద్రబాబు ముందుకొస్తున్నారు.



ఇఫ్తార్ విందులో ముస్లింలకు భోజనం వడ్డిస్తున్న అమిలినేని సురేంద్రబాబు

ఇంటింటికి సూపర్‌సిక్స్ పథకాలతో పెద్దఎత్తున ప్రచారం

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గంటౌన్, కళ్యాణదుర్గం రూరల్, కళ్యాణదుర్గం మున్సిపాల్టీ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి అమిలినేని సురేంద్రబాబు కుటుంబసభ్యులు సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు క్షుణ్ణంగా వివరిస్తూ టీడీపీని ఆదరించాలని కోరుతున్నారు. అమిలినేని సురేంద్రబాబు భార్య రమాదేవి, చెల్లెలు రాధ, కోడలు ఇషిత, కుమారుడు యశ్వంత్ చౌదరితో పాటు పలువురు పెద్దఎత్తున ప్రచారం చేపడుతున్నారు. సూపర్‌సిక్స్ పథకాలతో మహిళలకు పెద్దపీట వేశారని, ఈ పథకాలతో ఆర్థిక అభివృద్ధి సాధించడం జరుగుతుందని వివరిస్తున్నారు. ఆ దిశగా అమిలినేని కుటుంబ సభ్యులంతా ఇంటింటికి వెళ్లి పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు.



ఇంటింటి ప్రచారంలో సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ మహిళకు కరపత్రాలు అందజేస్తున్న అమిలినేని సురేంద్రబాబు



దళితుల ఆత్మీయ సమావేశానికి భారీగా హాజరైన దళితులు

వైసీపీ క్యాడర్ ఖాళీ... జోష్‌లో దుర్గం టీడీపీ

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో వైసీపీ క్యాడర్ అంతా ఖాళీ అవుతోంది. అమిలినేని సురేంద్రబాబు పెద్దఎత్తున ప్రచారంతో ఐదు మండలాలతో పాటు మున్సిపాల్టీ పరిధిలో టీడీపీలో కొత్త జోష్ వస్తోంది. దీంతో కళ్యాణదుర్గం నియోజకవర్గంలో రోజురోజుకు టీడీపీలోకి వలసలు ఊపందుకున్నాయి. ఇప్పటివరకు ఐదు మండలాల పరిధిలో 250 కుటుంబాల వరకు టీడీపీలోకి చేరాయి. భావి తరాల భవిష్యత్తు, తమ ప్రాంతం బాగు కోసం టీడీపీ పార్టీలోకి చేరుతున్నట్లు వారు స్పష్టంగా తెలియజేస్తున్నారు. ఈక్రమంలో ఏ గ్రామంలో చూసినా తెలుగుదేశం పార్టీకి ఆదరణ రోజురోజుకు పెరుగుతోంది.



జనసేన, టీడీపీ నాయకులు, మహిళలతో కలిసి ప్రచారం చేపట్టిన అమిలినేని కుటుంబసభ్యులు



పార్టీలో చేరిన వారితో విజయసంకేతాన్ని చూపుతున్న అమిలినేని

20,000 మందికి అమిలినేని ఆపన్న హస్తం

కరోనా కాలంలో అమిలినేని సురేంద్రబాబు ఆపన్న హస్తం అందించారు. వైద్య సిబ్బంది, పోలీసు సిబ్బంది, జర్నలిస్టులకు, వలస వెళ్లిన కూలీలకు, పేద ప్రజలు సుమారు 20 వేల కుటుంబాలను అమిలినేని సురేంద్రబాబు ఆదుకున్నారు. వారికి నిత్యావసర సరుకులను అందించి మానవత్వం చాటుకున్నారు. వైద్య సిబ్బందికి మెడికల్ కిట్లు, మాస్కులు, గ్లౌజులు, శానిటైజర్లు కూడా అందించారు. ఇలా మానవత్వంతో సేవా కార్యక్రమాలు నిర్వహించిన అమిలినేని సురేంద్రబాబు పలువురికి ఆదర్శంగా నిలిచారు.







వైద్య సిబ్బందికి మాస్కులు, గ్లౌజులు, మెడికల్ కిట్లను అందజేస్తున్న అమిలినేని యశ్వంత్, అవినాష్ చౌదరి, కరోనా సమయంలో వలస వెళ్లిన కూలీలకు నిత్యావసర సరుకులు ఏర్పాటు చేసిన దృశ్యాలు



ఇంటింటి ప్రచారంలో భాగంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులతో అమిలినేని యశ్వంత్